నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ | ఆదివారం 14-2-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 167 | పేజీలు: 4 | వెల: రూ.1/-

కోటి వృక్షార్చనలో భాగస్వాములు కండి

17న ఉదయం అంతా కలసి కోటి మొక్కలు నాటుదాం
సిఎం కెసిఆర్ జన్మదినోత్సవ కానుకగా కార్యక్రమం
పోస్టర్ విడుదల చేసిన మంత్రులు ఎర్రబెల్లి, శ్రీనివాసగౌడ్

హైదరాబాద్,ఫిబ్రవరి13(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా జరుగనున్న కోటి వృక్షార్చనలో ప్రతీ ఒక్కరు పాల్గొనాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పిలుపునిచ్చారు. ఈనెల 17న ఉదయం 10 నుంచి 11 గంటల వరకు కోటి మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. మినిస్టర్స్ క్వార్టర్స్‌లోని తన నివాసంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి కోటి వృక్షార్చన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన ఆదర్శమూర్తి సీఎం కేసీఆర్ అని చెప్పారు.ఆకుపచ్చ తెలంగాణ కోసం హరితహారం కార్యక్రమం చేపట్టారని వెల్లడించారు. 2015లో ప్రారంభమైన హరితహారం కార్యక్రమం ద్వారా ఇప్పటి వరకు 230 కోట్ల మొక్కలు నాటామన్నారు. అటవీశాఖ అధికారుల లెక్కల ప్రకారం 4 శాతం పచ్చదనం పెరిగిందని చెప్పారు. హరితహారం కార్యక్రమం విజయవంత మయ్యిందనడానికి ఇదే నిదర్శమన్నారు. ప్రపంచ పర్యావరణానికి, మానవ కళ్యాణానికి నిర్వహిస్తున్న కోటి వృక్షార్చన కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాల ఉలవ్వాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతా పూర్వక బహుమతిని అందిద్దామని చెప్పారు. ఈ సత్కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీ చైర్మన్లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కాగా, తన స్వగ్రామమైన అనుములకు మిషన్ భగీరథ నీళ్లు ఇంకా రాలేదన్న జానారెడ్డి మాటలను మంత్రి తీవ్రంగా ఖండించారు. నల్లగొండ జిల్లాలో గత మూడేండ్ల నుంచి ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయని చెప్పారు. జానారెడ్డి ఇంటికి కూడా మిషన్ భగీరథ నీళ్లు ఇస్తున్నాని మంత్రి స్పష్టం చేశారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న బీజేపీ ఒక్క కొలువు కూడా ఇవ్వలేదని విమర్శించారు. తెలంగాణ ప్రజుల ఆంధ్రా పార్టీలను రానివ్వరని, టీడీపీ విషయంలో ఇదే స్పష్టమయ్యిందని చెప్పారు.

కోటి వృక్షార్చనకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేసిన మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, శ్రీనివాసగౌడ్.

మేయర్ అనుచరుడికి షాక్

ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినందుకు జరిమానా

హైదరాబాద్,ఫిబ్రవరి13(ఆర్ఎన్ఎ): ఈనెల 11వ తేదీన గ్రేటర్ మేయర్‌గా విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్‌గా శ్రీలత ఎన్నికైన నేపథ్యంలో మేయర్ విజయలక్ష్మికి శుభాకాంక్షలు తెలుపుతూ ఆమె అనుచరుడు అతిష్ అగర్వాల్.. నగరంలో భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాడు. దీంతో విజయలక్ష్మి అనుచరుడైన అగర్వాల్ కు జీహెచ్ఎంసీ షాకిచ్చింది. ఇలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై నగర పౌరుడు ట్విట్టర్‌లో జీహెచ్ఎంసీ అధికారులను ప్రశ్నించాడు. దీంతో అప్రమత్తమైన జీహెచ్ఎంసీ అధికారులు.. ఫ్లెక్సీలు అనధికారికంగా ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన అతిష్ అగర్వాల్‌కు లక్ష రూపాయలు జరిమానా విధిస్తూ జీహెచ్ఎంసీ ఈవీడీఎం అధికారులు షాకిచ్చారు

రెండోదశ వ్యాక్సినేషన్ ప్రారంభం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి13(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారి నిర్మూలన కోసం మొదలుపెట్టిన వ్యాక్సినేషన్ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్నది. ముందుగా వైద్యసిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బందికి టీకాలు వేసిన అధికారులు, ఆ తర్వాత పోలీసులు, ఇతర భద్రతా బలగాలకు వ్యాక్సినేషన్ మొదలుపెట్టారు. మరికొన్ని రోజుల్లో వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న సాధారణ ప్రజలకు టీకాలు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు ఇప్పటికే టీకా తొలి డోస్ తీసుకున్న వారికి రెండో డోస్ ఇచ్చే కార్యక్రమాన్ని కూడా శనివారం మొదలు పెట్టారు. వ్యాక్సినేషన్ పక్రియ మొదటి రోజైన జనవరి 16న తొలి డోస్ వ్యాక్సిన్ తీసుకున్న అందరికీ రెండో డోస్ ఇస్తున్నారు. ఢిల్లీలోని బీబీటీ నగర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో సెకండ్ డోస్ వ్యాక్సినేషన్ మొదలయ్యింది.

కోటి వృక్షార్చనలో భాగస్వాములం అవుతాం

3లక్షల మొక్కలు నాటుతామన్న మంత్రి సత్యవతి

హైదరాబాద్,ఫిబ్రవరి13(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్ పుట్టిన రోజున నిర్వహించనున్న కోటి వృక్షార్చనలో గిరిజన, మహిళా, శిశు సంక్షేమ శాఖ భాగంకానుంది. ఈనెల 17న తమ శాఖ ఆధ్వర్యంలో మూడు లక్షల మొక్కలు నాటనున్నట్లు మంత్రి సత్యవతి రాథోడ్ చెప్పారు. ఇందులో భాగంగా గిరిజన గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో రెండు లక్షల మొక్కలు, మహిళా శిశు సంక్షేమ శాఖలోని కార్యాలయాల ప్రాంగణాల్లో, అంగన్‌వాడీలలో లక్ష మొక్కలు నాటుతున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి ప్రారంభించిన హరితహారం ఫలితాలు ఇప్పటికే రాష్ట్రంలో ప్రజలకు అందుతున్నాయని వెల్లడించారు. ఈ ఏడాది రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురియడంతో భూగర్భ జలాలు పెరిగాయని, హరిత హారం ప్రభావం వల్ల కాలుష్యం గణనీయంగా తగ్గిందని పలు సర్వేలు వెల్లడించడం సీఎం ముందు చూపునకు నిదర్శనమని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించాలన్న గొప్ప సంకల్పంతో సీఎం కేసీఆర్ ప్రతి గ్రామంలో నర్సరీలు ఏర్పాటు చేశారని, దీనిద్వారా ఊర్లన్ని హరిత గ్రామాలుగా మారుతున్నాయని చెప్పారు. నర్సరీల తోపాటు ప్లలె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసి పచ్చదనం పెంచడంతో పాటు ఆహ్లాదకర వాతావర ణాన్ని సృష్టిస్తున్నారని చెప్పారు. ఎంపీ సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో సెలబ్రెటీలు కూడా భాగస్వాములవుతున్నారని వెల్లడించారు.

బి.ఫార్మసి విద్యార్థిని కిడ్నాప్ కేసు ఫాల్స్

అదంతా డ్రామాగా గుర్తించిన పోలీసులు
అత్యాచారం అబద్ధమని తేల్చిన వైద్యులు
కుటుంబ కలహాలతోనే డ్రామాలను ఆడినట్లు గుర్తింపు
వివరాలు వెల్లడించిన రాచకొండ సిపి మహేశ్ భగవత్

హైదరాబాద్,ఫిబ్రవరి13(ఆర్ఎన్ఎ): ఘట్‌కేసర్ బీఫార్మసీ విద్యార్థిని కిడ్నాప్ వ్యవహారం ఓ ఫాల్స్ కేసునుగా పోలీసులు నిర్ధారించారు. బీఫార్మసీ విద్యార్థినిపై అత్యాచారం జరగలేదని రాచకొండ సీపీ మహేష్ భగవత్ తెలిపారు. విద్యార్థినిపై కిడ్నాప్, అత్యాచారం జరిగిందన్నది అవాస్తవం అన్నారు. కావాలనే యువతి కట్టుకథలు అల్లిందని తెలిపారు. ఘట్‌కేసర్ విద్యార్థిని ఘటనపై శనివారం సీపీ మహేష్ భగవత్ మీడియాకు వివరాఉల వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతి చెప్పినవిధంగా ఘటన జరిగినట్లు ఆధారాలు లేవన్నారు. విద్యార్థిని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో భయపడి అబద్ధం చెప్పిందని తెలిపారు. విద్యార్థిని చెప్పిన విధంగా ఘటన జరిగినట్లు ఆధారాలు లేవని చెప్పారు.10 వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు డయల్ 100కు కాల్ వచ్చిందని తెలిపారు. యువతిని ఆటోవాళ్లు కిడ్నాప్ చేశారనే కాల్ వచ్చిందని పేర్కొన్నారు. ఫిర్యాదు రాగానే పోలీసులు అలర్ట్ అయ్యారని తెలిపారు. పోలీసులు వెళ్లేసరికి యువతి స్పృహ కోల్పోయి ఉందన్నారు. రాత్రి 7.50 గంటలకు యవతి సెల్ ఫోన్ రెస్పాండ్ అయిందని చెప్పారు. తనపై అత్యాచారం జరిగిందని పోలీసులకు చెప్పిందని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్‌తో గతంలో వివాదాలున్నాయని విద్యార్థిని చెప్పినట్లు వెల్లడించారు. 100 సీసీ కెమెరాల ఫుటేజ్ ను పరిశీలించినట్లు ప్రకటించారు. సీసీ ఫుటేజ్ పరిశీలిస్తే ఎటువంటి ఆధారాలు లభ్యమవ్వ లేదన్నారు. కుటుంబ వివాదంతోనే యువతి బయటకు వెళ్లిందని చెప్పారు. పేరెంట్స్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని తెలిపారు. విచారణలో అదంతా అవాస్తమని తేలిందని చెప్పారు. కొందరు అనుమానితుల్ని గుర్తించామని చెప్పారు. కేసులో విచారిం చిన ఆటో డ్రైవర్లకు మహేశ్ భగవత్ క్షమాపణలు చెప్పారు. విద్యార్థినిపై అత్యాచారం జరగలేదని, కిడ్నాప్‌కు కూడా ఎవరూ ప్రయత్నించలేదని రాచకొండ సీపీ మహేశ్ భగవత్ స్పష్టం చేశారు. 10వ తేదీ సాయంత్రం 5:30 గంటల నుంచి రాత్రి 7:50 గంటల వరకు 4 కిలోమీటర్ల నడిచిన యువతి.. కిడ్నాప్, అత్యాచారం చేశారని నాటకామాడింది. ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5:30 గంటలకు బీ ఫార్మసీ చదువుతున్న యువతి రాంపల్లి బస్టాండ్ వద్ద కాలేజీ బస్సు దిగింది. అక్కడ్నుంచి ఆటోలో తన సీనియర్‌తో కలిసి ఎక్కింది. ఆమె దిగాల్సిన స్టాప్ కంటే ముందే సీనియర్ దిగి వెళ్లిపోయాడు. హెరిటేజ్ స్టాప్ వద్ద దిగాల్సిన విద్యార్థి, ఆ తర్వాతి స్టాప్‌లో ఆటో దిగింది. అప్పుడు సాయంత్రం 6:30 గంటల సమయం అవుతోంది. యువతి తన తల్లికి ఫోన్ చేసి తనను ఎవరో కిడ్నాప్ చేశారని చెప్పింది. దీంతో కంగారుపడ్డ తల్లి 100కి డయల్ చేయడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. కీసర, ఘట్‌కేసర్, మల్కాజ్‌గిరి పోలీసులు అప్రమత్తమై యువతి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. యువతికి పలుమార్లు ఫోన్ చేయగా చివరకు 7:45 గంటలకు ఫోన్ లిఫ్ట్ చేసింది. తాను ఉన్న లోకేషన్‌ను పోలీసులకు షేర్ చేయడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. యువతి కాలికి గాయమైనట్లు పోలీసులు గుర్తించారు. బట్టలు కూడా సరిగా లేకపోవడంతో పోలీసులు ఆమెపై అత్యాచారం జరిగిందని భావించి మేడిపల్లిలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అప్పటికీ ఆ అమ్మాయి పోలీసులకు స్పందించడం లేదు. ఏం జరిగిందో చెప్పే స్థితిలో లేదు. పోలీసులు ఆ రోజు రాత్రి అమ్మాయిని విచారిస్తున్న సందర్భంగా కొన్ని విషయాలు చెప్పింది. తనను బలవంతంగా ఆటోలో ఎక్కించుకుని ఇంజెక్షన్ ఇచ్చారని, తలపై బాదారని తెలిపింది. తెల్ల కలర్ ఆటోలో ఈ ఘటన జరిగినట్లు, అది సెవెన్ సీటర్ ఆటోల అని చెప్పింది. యువతి చెప్పిన సమాచారంతో అన్నోజిగూడ ఏరియాలోని ఆటో డ్రైవర్లను సుమారు 100 మందిని విచారించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. ఆ ముగ్గురిలో ఒకరు తనను బలవంతం చేశారని పోలీసులకు తెలిపింది. దీంతో అతన్ని పోలీసులు విచారణ చేయగా, తాను ఆ సమయంలో బార్‌కు వెళ్లానని ఆటో డ్రైవర్ చెప్పాడు. డ్రైవర్ సమాధానంతో సీసీటీవీ ఫుటేజీలు పరిశీలించగా నిజమేనని తేలింది. యువతి తప్పుదోవ పట్టిస్తున్నట్లు పోలీసులు గ్రహించారు. ఇక ఆ యువతి మరుసటి మరో నాటకానికి తెరలేపింది. తనపై అత్యాచారం చేశారని తెలిపింది. దీంతో యువతిని మెడికల్ ఎగ్జామినేషన్‌కు పంపగా అలాంటిదేమీ జరగలేదని తేలింది. ఇక చివరకు ఆ యువతి జరిగిన విషయాన్ని పోలీసులకు వివరించింది. ఇంటి నుంచి వెళ్లిపోయేందుకే కిడ్నాప్ నాటకం, అత్యాచారం చేశారని తల్లికి ఫోన్ చేసి చెప్పానని యువతి పోలీసులకు చెప్పింది. ఆర్నేళ్ల క్రితం కూడా ఆమె ఇలాగే కిడ్నాప్ నాటకామాడినట్లు పోలీసుల విచారణలో తేలింది. కుటుంబ సభ్యులతో గొడవల కారణంగానే యువతి ఈ ప్రణాళిక చేసినట్లు పోలీసులు వికరించారు.

ఫార్మసీ విద్యార్థి కిడ్నాప్ కథపై సిసి ఫుటేజ్ ఆధారాలతో సహా మీడియాకు వివరించిన రాచకొండ కమిషనర్ మహేశ్ భగవత్

ప్రధాని మోడీతో ఎంపి రఘురామ భేటీ

రాజధాని మార్పు ,విశాఖ స్టీల్ ప్లాంట్, ఆలయ దాడులపై వివరణ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి13(ఆర్ఎన్ఎ): ప్రధాని మోదీతో 18 నిమిషాల సమావేశం అద్భుతంగా సాగిందని నర్సాపురం ఎంపీ రఘురామ కృష్ణరాజు తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడారు. 'తాను లేవనెత్తిన అన్ని అంశాలకు మోదీ సానుకూలంగా స్పందించారు.

మీ చేతులపై శంకుస్థాపన చేసిన అమరావతిని నిలిపివేస్తే పేద రైతులకు అన్యాయం జరుగుందని చెప్పా. దేవాలయాలపై దాడులు విషయంలో జోక్యం చేసుకోవాలని కోరా. విశాఖ స్టీల్ఎ÷–లాంట్‌ను ప్రైవేటుపరం చేయొద్దని చెప్పా. స్టీల్‌ప్లాంట్‌పై మోదీ అభయం లభించినట్టుగానే భావిస్తున్నా' అని స్పష్టం చేశారు. ఇకపోతే ఏపీ ప్రభుత్వ తీరుపై ప్రధాని మోదీ ఆశ్చర్యం వ్యక్తం చేశారని ఎంపీ రఘురా మకృష్ణరాజు తెలిపారు. ఏపీలో జరుగుతున్న పరిణామాలను ప్రధాని దృష్టికి రఘురామ తెచ్చినట్లు తెలుస్తోంది. రాజధాని మార్పు మొదలుకుని విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, దేవాలయాలపై దాడులు ఇలా అనేక విషయాలను ప్రధానికి ఆయన వివరించినట్లు చెబుతున్నారు. వీటన్నింటిపై సావధానంగా విన్న ప్రధాని ఒక్క విషయంలో మాత్రం విస్మయానికి గురయ్యారు. అదేంటంటే రాష్ట్రంలో చర్చిల నిర్మాణాలకు ప్రభుత్వం టెండర్లు పిలిచిందని రఘురామ, మోదీకి తెలిపారు. దీంతో చర్చిల నిర్మాణానికి టెండర్లా? అని ప్రశ్నిస్తూ.. ఆశ్చర్యానికి గురయ్యారని, ప్రభుత్వమే టెండర్లు పిలవడం ఎలా సాధ్యమని మోదీ అన్నారని రఘురామ పేర్కొన్నారు. చర్చిల టెండర్లకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని, రఘురామకృష్ణరాజును మోదీ కోరారు.

సరైన సమయంలో జమ్మూకశ్మీర్‌కు రాష్ట్రహోదా: అమిత్ షా

న్యూఢిల్లీ: జమ్ముకశ్మీర్‌కు సరైన సమయంలో రాష్ట్రహోదాను పునరుద్ధరి సామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చెప్పారు. జమ్ముకశ్మీర్ రీఆర్గనైజేషన్ బిల్లు-2021పై లోక్‌సభలో చర్చ సందర్భంగా మాట్లాడిన అమిత్ షా.. జమ్ముకశ్మీర్‌కు రాష్ట్రహోదా పునరుద్ధరణపై ఎలాంటి అనుమానాలు అక్కర్లేదన్నారు. జమ్ముకశ్మీర్ రీఆర్గనైజేషన్ బిల్లు-2021 అంటే జమ్ముకశ్మీర్‌కు రాష్ట్రహోదా పునరు ద్ధరణను నిరాకరించే బిల్లు అని పలువురు ఎంపీలు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారని, కానీ అందులో నిజం లేదని హోంమంత్రి స్పష్టం చేశారు. జమ్ముకశ్మీర్‌కు రాష్ట్రహోదా అక్కర్లేదు అని ఆ బిల్లులో ఎక్కడ ఉన్నదని అమిత్ షా ప్రశ్నించారు. బిల్లులో అలాంటివేవీ లేకుండానే ఎంపీలు ఎలా ఓ నిర్ణయానికి వచ్చారని నిలదీశారు. జమ్ముకశ్మీర్ సరైన సమయంలో రాష్ట్రహోదా తిరిగిస్తామని తాను గతంలోనే చెప్పానని, మరోసారి సభామఖంగా స్పష్టంచేస్తున్నానని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత బిల్లు ఆ ప్రాంత పునర్నిర్మాణానికి సంబంధించినదని, ఈ బిల్లుకు, రాష్ట్రహోదాకు ఎలాంటి సంబంధం లేదని అమిత్ షా చెప్పారు. కాగా, సభలో బిల్లు ప్రవేశపెట్టిన వెంటనే కాంగ్రెస్ పార్టీ బిల్లుకు వ్యతిరేకంగా నినాదాలు చేసింది. ఆర్టికల్ 370 రద్దు సందర్భంగా జమ్ముకశ్మీర్ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా ప్రభుత్వం నెరవేర్చలేదని కాంగ్రెస్ లోక్‌సభపక్ష నేత అధిర్ రంజన్ ఛౌదరి విమర్శించారు. పండిట్లను వెనక్కి రప్పిస్తామని, యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం వాటి అమలులో పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు.

అనంతరం, మాట్లాడిన అమిత్ షా కాంగ్రెస్ విమర్శలను తిప్పికొట్టారు. కాంగ్రెస్ ఎంపీల ఆరోపణలు దురుద్దేశంతో కూడినవని, తగిన సమయం చూసి జమ్ముకశ్మీర్‌కు రాష్ట్రహోదా కల్పిస్తామని హోంమంత్రి అమిత్ షా చెప్పారు. సుదీర్ఘ చర్చ అనంతరం జమ్ముకశ్మీర్ రీఆర్గనైజేషన్ బిల్లు-2021కు లోక్‌సభ ఆమోదముద్ర పడింది.

చరిత్రలో నేటినిజం



షిర్డీ వెళ్ళిన భక్తులపై దొంగల దాడి

వికారాబాబాద్,ఫిబ్రవరి13(ఆర్ఎన్ఎ): షిర్డీ వెళ్లి వస్తున్న కుటుంబంపై దుండగులు విచక్షణా రహితంగా దాడి చేశారు. ఈ ఘటన మహారాష్ట్రలోని వాసీ పోలీస్ స్టేషన్ పరిధిలో గడిచిన రాత్రి చోటుచేసుకుంది. బాధితులు వికారాబాద్ జిల్లా కుల్చెర్ల మండలంలోని బండ వెలక్కిచెర్లకు చెందిన కుటుంబ సభ్యులు. గ్రామానికి చెందిన ప్రధాన ఉపాధ్యాయుడు కె. రాములు, తెలంగాణ గ్రామీణ బ్యాంకులో పనిచేస్తున్న ఉద్యోగి రమేష్ కుటుంబంతో కలిసి షిర్డీ సాయిబాబా దర్శనానికి వెళ్లారు. షిర్డీ నుంచి తిరిగి వస్తుండగా వాసీ వద్ద వీరిని దొంగలు అడ్డగించారు. వీరి నుంచి తప్పించుకునే క్రమంలో కారు బోల్తా పడింది. ఈ సమయంలో దొంగలు చిన్నపిల్లలు, మహిళలు అని చూడకుండా కత్తులు, రాళ్లతో విచక్షణ రహితంగా దాడి చేశారు. దాడిలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరి వద్ద నుంచి 8 తులాల బంగారు నగలను దొంగలు అపహరించుకుపోయారు. బాధితులను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు.

కెసిఆర్ బర్త్‌డే రోజు అనేక కార్యక్రమాలు

-బల్కంపేట అమ్మవారికి బంగారుచీర కానుక

హైదరాబాద్,ఫిబ్రవరి13(ఆర్ఎన్ఎ): ఫిబ్రవరి 17న తెలంగాణ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు బర్త్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు టీఆర్ఎస్ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం పుట్టిన రోజున ఉదయం 10-00 గంటల నుంచి 11-00 గంటల వరకు కేవలం ఒక గంట వ్యవధిలో కోటి మొక్కలు నాటే కోటి వృక్షార్చన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కేసీఆర్ బర్త్ డే రోజున బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారికి బంగారు చీరను సమర్పించనున్నట్లు తెలంగాణ పశుసంవర్ధక మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇప్పటికే తెలిపారు. ఫిబ్రవరి 17న ఉదయం ఆరు గంటలకు ఎల్లమ్మ అమ్మవారికి పంచామృ తాలతో ప్రత్యేక అభిషేకం, తొమ్మిది గంటలకు మృత్యుంజయ హోమం, ఆయుష్షు హోమం, అన్నప్రసాద పంపిణీ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. దాతల సహకారంతో 2.5 కేజీల బంగారంతో రూపొందించిన చీరను అమ్మవారికి సమర్పిస్తామని ఆయన వెల్లడించారు.

దేశ దీర్ఘకాలిక అభివృద్ధి కోసమే సంస్కరణలు

కరోనా సంక్షోభంలోనూ సంస్కరణలకు పెద్దపీట
ప్రధాని పాలనానుభవానికి బడ్జెట్ ప్రతిరూపం
పేదలను విస్మరించారన్న వాదనలో అర్థం లేదు
రాహుల్‌గాంధీ వినాశకర శక్తిగా మారారు
బడ్జెట్‌పై చర్చకు సమాధానంలో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి13(ఆర్ఎన్ఎ): కరోనా సృష్టించిన సంక్షోభంలోనూ ప్రభుత్వం సంస్కరణలకు సంబంధించిన అవకాశాలను వదులుకోలేదని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ తెలిపారు. బడ్జెట్‌పై చర్చ అనంతరం శనివారం లోక్‌సభకు సమాధానం ఇచ్చిన నిర్మలాసీతారామన్.. ప్రభుత్వం చేపట్టే సంస్కరణలను కరోనా మహమ్మారి నిరోధించలేకపోయిందని, దేశ దీర్ఘకాలిక అభివృద్ధికి సంస్కరణలు తప్పనిసరని చెప్పారు. తాజా బడ్జెట్ ప్రధాని నరేంద్రమోదీ అపారమైన అనుభవానికి, పరిపాలనా సామర్థ్యాలకు నిదర్శనమని నిర్మలాసీతారామన్ పేర్కొన్నారు. బడ్జెట్లో ఆరోగ్యరంగానికి పెద్దపీట వేశామని, దేశ ప్రజల సంక్షేమానికి ఇది ఎంతో దోహదపడుతుందని ఆమె చెప్పారు.

కొందరు పనిగట్టుకుని బడ్జెట్‌పై విమర్శలు చేస్తున్నారని, ధనికుల మేలుచేసేలా బడ్జెట్ ఉందంటున్నారని ఆర్థికమంత్రి విమర్శించారు. బడ్జెట్ పీఎం స్వనిధి యోజనకు భారీగా నిధులు కేటాయించామని, ఆ పథకం ధనవంతులకు ఉపయోగపడేది కాదని చెప్పారు. రెవెన్యూ విభాగానికి 2013-14 బడ్జెట్‌లో రూ.1,16,931 కోట్లు కేటాయిస్తే తాజా బడ్జెట్‌లో రూ.2,09,319 కోట్లు కేటాయించామని, పింఛన్‌ల కోసం 2013-14 లో 44,500 కోట్లు కేటాయించగా ఇప్పుడు అది రూ.1,33,825 కోట్లకు పెరిగిందని నిర్మలాసీతారామన్ వెల్లడించారు. ఆప్తుల కోసం బడ్జెట్ అనడంలో అర్థం లేదని, అసలు ఆప్తులు ఎక్కడున్నారని, బహుశా ప్రజల తిరస్కారానికి గురైన పార్టీ నీడలో ఉండి ఉండొచ్చని ఆర్థికమంత్రి ఎద్దేవా చేశారు. ఇదే సందర్భంగా సీతారామన్ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారిని రాహుల్ గాంధీ నిరంతరం అవమానిస్తున్నారని, అనేక అంశాలపై బూటకపు కథనాలను సృష్టిస్తున్నారని, ఆయన మన దేశానికి ప్రళయకారకుడిగా మారుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ అనేక ఆరోపణలు చేస్తున్నారని, బూటకపు కథనాలను సృష్టిస్తున్నారని, ప్రభుత్వం చెప్పే సమాధానాలను వినేందుకు ఆయనకు సహనం ఉండటం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న రెండు రకాల వైఖరులను గుర్తించవలసిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన పార్లమెంటరీ వ్యవస్థపై కాంగ్రెస్‌కు నమ్మకం లేదని స్పష్టమవుతోందన్నారు. రాహుల్ గాంధీ గురువారం పార్లమెంటులో బడ్జెట్‌పై మాట్లాడేందుకు నిరాకరించి, కొత్త సాగు చట్టాలపై మాట్లాడారు.

దీనిపై నిర్మల సీతారామన్ స్పందిస్తూ, రాహుల్ గాంధీ బహుశా భారత దేశానికి ప్రళయకారకుడిగా మారుతున్నారని దుయ్యబట్టారు. రాహుల్ గాంధీ పది అంశాలను పార్లమెంటులో ప్రస్తావించాలని తాను కోరుకున్నానని, అయితే వాటి గురించి ప్రస్తావించకుండా, తనను నిరాశకు గురిచేశారని అన్నారు. సాగు చట్టాలపై కాంగ్రెస్ యూ-టర్న్ తీసుకోవడానికి కారణాలను తెలుసుకోవాలని అనుకున్నానని, అయితే తనకు సమాధానం లభించ లేదని చెప్పారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలలో హామీ ఇచ్చినట్లుగా రైతుల పంట రుణాలను ఆ రాష్ట్రాల్లో ఎందుకు రద్దు చేయలేదో తెలుసుకోవాలనుకుంటున్నానని తెలిపారు. పంజాబ్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉందని, అక్కడి రైతుల సమస్యలపై రాహుల్ గాంధీ మాట్లాడటం లేదని అన్నారు. పంట దుబ్బల కాల్చివేతపై పంజాబ్ ప్రభుత్వం తీసుకున్న చర్యల గురించి ఆయన మాట్లాడటం లేదన్నారు. కొత్త సాగు చట్టాల్లో రైతులకు వ్యతిరేకంగా ఉన్న నిబంధనలేమిటో ఆయన చెప్పడం లేదన్నారు.

కాంగ్రెస్ పార్టీ కేవలం మేమిద్దరం, మాకు ఇద్దరు గురించి మాత్రమే ఆలోచిస్తోందని, రైతుల నుంచి అల్లుడు గారు కొట్టేసిన భూమిని తిరిగి రాహుల్ ఇచ్చేస్తారని తాను భావించానన్నారు. వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్ కమిటీల సంస్కరణలను మాజీ ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ సమర్థించారని, ఆయన ఇచ్చిన స్టేట్‌మెంట్ గురించి రాహుల్ గాంధీ మాట్లాడటం లేదని అన్నారు.

విపత్తు నిధుల కింద ఎపికి రూ.280.76 కోట్లు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి13(ఆర్ఎన్ఎ): కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అధ్యక్షతన ఉన్నత స్థాయి కమిటీ హెచ్ఎల్‌సీ ఐదు రాష్ట్రాలకు జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి (ఎన్‌డీఆర్ఎఫ్) కింద అదనపు కేంద్ర సహాయాన్ని ఆమోదించింది. 2020లో వరదలు, తుఫాను, తెగులు దాడి వలన ప్రభావితమైన రాష్ట్రాలకు నిధుల విడుదలకు కేంద్రం ఆమోదం తెలిపింది.

కాగా ఈ ఐదు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ కూడా ఉంది. జాతీయ విపత్తు ప్రమాద నిర్వహణ నిధి నుంచి నాల

నేటినిజం
ఆదివారం 14-2-2021

ప్రేమలందు రాజకీయ ప్రేమలు వేరయా...!

ప్రేమికుల దినోత్సవం జరుపుకుంటున్న వేళ..ఎవరిపై ఎవరికీ ప్రేమలు ఉంటున్నాయో గుర్తించాలి. ప్రేమల్లో రకరకాల ప్రేమలు ఉంటాయి. ఒకరిపై ఒకరికి ప్రేమ ఉండడం అనేది వారితో ఉన్న అనుబంధాన్ని బట్టి ఉంటుందని గుర్తించాలి. ఎవరికి వారు తమ వృత్తినే ప్రేమిస్తున్నారు. దానివల్ల కలిగే లాభాన్ని, ప్రయోజనా లను ప్రేమిస్తుంటారు. రాజకీయ నాయకుల ప్రేమలు అయితే పలురకాలుగా ఉంటుంది. వారి అవసరాల మేరకు ప్రేమలను మారుస్తుంటారు. అందుకనే నిజమైన ప్రేమికుల జంటల మధ్య ఉన్న ప్రేమకు..ఇతరుల ప్రేమికుల మధ్య ఉండే ప్రేమకు చాలా వ్యత్యాసం ఉంటుంది. అన్నదమ్ములు,అక్కాచెల్లెళ్ల మధ్య ఆస్తుల మధ్య ఉన్న ప్రేమ తమ బంధుత్వాలపై ఉండదు. పిల్లకు తమ పిల్లపై ఉన్న ప్రేమ కారణంగా తల్లి దండ్రులపై ఉండకపోవచ్చు. అలాగని వారిని ప్రేమలేని వారుగా చూడరాదు. ప్రేమను ఎవరికి వారు తమకోణంలో చూడడం వల్ల ఇతరులకు అది ప్రేమగా కనిపించకపోవచ్చు. ప్రధానంగా ప్రభుత్వాలకు ప్రజలపై ప్రేమ ఉండడం లేదు. అంతా స్వార్థంతో కూడిన ప్రేమ మాత్రమే కనిపిస్తోంది. వారికి ఓట్ల ప్రేమ తప్ప మరోటి కానరాదు. ఓట్లు కొల్లగొట్టేందుకు ఎలాంటి ప్రేమనైనా వ్యక్తం చేస్తారు. ప్రజల్లో ప్రేమ ఉన్నట్లు నిరంతరా యంగా నటించడంలో మన నాయకులను మించిన వారు ఉండరు. నిజమైన ప్రేమికుల్లో సైతం అప్పుడ ప్పుడు కొంత విభేదాలు కనిపిస్తాయేమో కానీ..నాయకుల్లో మాత్రం అలాంటి వైఖరి కనిపించందు. ఆకాశం దించి అరచేతిలో పెడతామని ప్రమాణం చేస్తారు. సముద్రాన్ని తీసుకుని వచ్చి హుస్సేన్ సాగర్ పక్కన పెడతామంటారు. హైదరాబాద్‌ను అద్భుత నగరంగా తీర్చిదిద్దుతామంటారు. నగరంలో మంచినీటి సమస్యలు లేకుండా చేస్తామంటారు. ఇంటింటికీ రేషన్ నేరుగా పంపిణీ చేస్తామంటారు. అంతెందుకు ఒక్క ఆహారం వండి పెట్టడమే తరువాయి..అన్నీఉచితంగానే ఇస్తామని హామీలు ఇచ్చి ప్రజలపై ప్రేమ కురిపిస్తుంటారు. ఏ పనిచేసినా తమ ప్రేమికులైన ప్రజల కోసమే అని అంటారు.

అయితే సమస్యలపై మాత్రం ప్రేమ కురిపించరు. రైతులు ఆత్మహత్యలుచేసుకుంటున్నా..భూములు కబ్జాలకు గురవుతున్నా ప్రేమను ప్రకటించరు. నటించడం రాదు కనుక ఇక్కడా నిజమైన ప్రేమను ప్రకటిస్తారు. ఆస్పత్రిలో సమస్యలు ఉన్నాయంటే అక్కడ ప్రేమ పనిచేయదు. ఫీజులతో వేధిస్తున్నారంటే పట్టించుకోరు. ఎందుకంటే అక్కడ ప్రేమ వేరుగా ఉంటుంది. ప్రైవేట్ ఆస్పత్రులపై, ప్రైవేట్ విద్యాసంస్థలపై అవ్యాజమైన ప్రేమ ఉంటుంది. అటువైపు ప్రేమ ఉన్నచోట మరోవైపు ప్రేమ చూపడం సాధ్యం కాదుక మన నాయకులు మిన్నకుంటారు. ప్రేమ ఎప్పుడైనా ఒకరితోనే ఉండాలన్న సూత్రానికి కట్టుబడి ఉంటారు. మోడీని తీసుకుంటే ఆయనకు కేవలం అంబానీ, ఆదానీలతో పాటు తాజాగా విశాఖ ఉక్కు కోసం ఫోక్సోతో ప్రేమలో పడ్డారు. అందుకే తమను కూడా ప్రేమించాలన్న విశాఖ ఉక్కు కార్మికులను ప్రేమించే అవకాశం లేదు. ఆయనకు డిజిన్వెస్ట్‌మెంట్ మీద ప్రేమ ఎక్కువ. ప్రైవేట్ రంగంపై ప్రేమ ఎక్కువ. వారంతా బాగా బలపడితే అంతకన్నా ఆనందం ఉండదన్న ఆశతో ప్రేమలో పడ్డారు. ప్రభుత్వరంగాలపై అందుకే ప్రేమను వదులు కుంటారు. అంతెందుకు తనను తీసుకుని వచ్చి..గద్దెనెక్కించిన అద్వానీపైనే ప్రేమను వదులుకున్నారు. తనను కాపాడి..రాజకీయంగా ఉన్నత స్థానానికి తీసుకుని వచ్చినా సరే ఆయనకు అద్వానీ అంటే ప్రేమ లేదు. ఎందుకంటే పదవిపై ప్రేమ కారణంగా అద్వానీ లాంటి వారిని ప్రేమించే అవకాశం మోడీకి లేకుండా పోయింది. అందుకే తాను ప్రేమించిన సాగుచట్టాలను పట్టాలకు ఎక్కించేందుకు రైతులపై ప్రేమను వదులు కున్నారు. అలాగని వారిపై ప్రేమ నటించడం కూడా ప్రధాని మోడీకి ఇష్టం ఉండదు. అలాగే తన ప్రేమ అంతా రైతులకోసమే అని చెప్పడం ద్వారా వ్యవసాయ చట్టాల అమలు కోసం ప్రేమపెట్టి పనిచేస్తున్నారు.

ఇకపోతే సిఎం కెసిఆర్‌కు మేఘా కృష్ణారెడ్డి, జూపల్లి రామేశ్వరరావుతో పాటు, తన కుటుంబీకులపై అవ్యాజమైన ప్రేమ ఉంటుంది. వారు చేపట్టే పనులపై ప్రేమను పెంచుకుంటారు. అలా వారికి వ్యతిరేకంగా వ్యవహరించే వారిపై ప్రేమను చాటుకోవడం ఆయనకు సాధ్యం కావడం లేదు. ఇకపోతే పాలకులు అందరికీ ప్రైవేట్ విద్యాసంస్థలతోనే ప్రేమ ఎక్కువ. వారి ప్రేమలో పడి అందరినీ మర్చి పోతారు. ఫీజుల కొరడా ఝుళిపిస్తున్న తరుణంలో వస్తున్న ఆర్తనాదాలు వినపడవు. ప్రేమ మైకంలో వారంతా ఇలాంటి సౌండ్స్‌ను పట్టించుకోరు. అందుకే ఇటీవల స్కూళ్లు నడవకున్నా..క్లాసులు జరగకున్నా కేజీ నుంచి పిజి వరకు ముక్కుపిండి ఫీజులు కట్టించుకుంటున్నా ఆ వైపు దృష్టి పెట్టడం లేదు. త్వరలో టెన్త్, ఇంటర్ పరీక్షలు ప్రారంభం కాబోతున్నాయి. పిల్లలు పరీక్షల కోసం కుస్తీ పడుతున్నారు. పరీక్షల కోసం అధికారులు భారీగా ఏర్పాట్లు చేశారు. అయితే ఇప్పటికే వచ్చే ఏడాదికి సంబంధించి అడ్మిషన్ల గోల మొదలయ్యింది. ప్రైవేట్ స్కూళ్లు యదావిధిగా వసూళ్లకు తెగబడుతున్నాయి. తల్లిదండ్రులను పీల్చిపిప్పిచేసే పనిలో పడ్డాయి. ఈ క్రమంలో వీరి ప్రేమంతా వసూళ్లపైనే ఉంది. విద్యార్థులు, టీచర్లపై వారికి ఎందుకనో అస్సలు ప్రేమ ఉండడం లేదు. అందుకే తాము ప్రేమించిన డబ్బు తమవద్దే ఉండాలన్న ప్రేమతో టీచర్లకు జీతాలు ఇవ్వాలన్న మనస్సు రావడం లేదు. అలాగే డబ్బులు లాగేయాలన్న ప్రేమలో తల్లిదండ్రులను వేధించక తప్పడం లేదు. ప్రేమించిన పిల్లలు పెళ్లి చేసుకునేందుకు తల్లిదండ్రలను ఎలా ఎదిరిస్తారో.. ప్రైవేట్ విద్యాసంస్థలు కూడా తమ డబ్బు కోసం విద్యార్థుల తల్లిదండ్రులను ప్రేమించడం లేదు. తమ ఫీజుల ప్రేమ అంతా మీ పిల్లల కోసమే అని చెప్పి పరోక్షంగా నిజమైన ప్రేమను ప్రకటిస్తారు. ఇక అమరావతిపై రైతులకు ఉన్న ప్రేమ సిఎం జగన్‌కు ఉండడం లేదు. అందుకే అటువైపు వెళుతున్నా ఆయన రైతులను కనీసంగా నైనా కన్నెత్తి చూడడం లేదు. వైజాగ్ అన్న అమ్మాయికి మనసు ఇచ్చేసిన మన సిఎం జగన్ అమరావతిని ప్రేమించమని ఒత్తిడి చేయడాన్ని పట్టించుకోవడంలేదు. ప్రేమలో ఉన్న మాధుర్యమే అది. ఎవరికైనా ఒకరితో ప్రేమ ముడిపడితే దానికే కట్టుబడి ఉంటారు. దానిని దక్కించుకునేందుకు ఎంతకైనా తెగిస్తారు. రాజకీయ నాయకులకు పదవిపై ఉన్న ప్రేమ కారణంగానే వారు తెగించి పనిచేస్తుంటారు. తమ ప్రేమను బతికించుకోవడానికి ఎంతటి త్యాగాలకైనా సిద్ధ పడుతుంటారు. మొత్తంగా ప్రపంచంలో ఒక్కొక్కరిదీ ఒక్కో రకమైన ప్రేమ. వారి ప్రేమలు బతకాలని..ప్రేమ జయించాలని కోరుకుందాం.!

మతతత్వ బీజేపీ నుండి గ్రేటర్ రక్షణ కోసం హిందూ మహిళలకు మద్దతునిచ్చాం

-చీకటి ఒప్పందం కాదు..ప్రజాస్వామ్య పరిరక్షణ

-ఎంఐఎం జిల్లా ఇంచార్జి సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 13 : (నేటినిజం ప్రతినిధి): శాంతి సౌభాగ్యాలు విలసిల్లుతున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం గ్రేటర్ హైదరాబాద్ మేయర్ ఎన్నికల్లో ప్రజాస్వామ్య తమ అధినేత బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ టిఆర్ఎస్ లో ఉన్న హిందూ మహిళా సోదరీమణులను గౌరవించి మద్దతునిచ్చారని, మతతత్వ బీజేపీ పార్టీ రగిల్చే విద్వేషాలు, విధ్వంసాల బారినుండి హైదరాబాద్ నగరాన్ని శాంతియుతంగా ఉంచేందుకు, సెక్యులర్ నేత సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని దేశంలో, రాష్ట్రంలో బల పర్చేందుకు సరైన నిర్ణయం తీసుకున్నారని ఎంఐఎం జిల్లా ఇన్చార్జి సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ స్పష్టం చేశారు .శనివారం దారుస్సలాంలో ఆయన మాట్లాడుతూ తమ అధినేత ఈ దేశ సర్వభౌన్నత్యం, ఉన్నతి కోసం విధాన పరమైన నిర్ణయాలు తీసుకుంటారని స్పష్టంచేశారు. హైదరాబాద్ మేయర్ జనరల్ స్థానంలో ఆలంపల్లి పోచయ్య అనే దళితున్ని మేయర్ కుర్చీలో కూర్చోబెట్టిన చరిత్ర ఉందని చెప్పారు. నేడు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలకు, దళితులకు రక్షణ లేదని, రాజకీయ ప్రాధాన్యత ఎక్కడ ఉంటుందని ఎద్దేవ చేశారు. మోదీ, అమిత్ షాలు నేడు భారత దేశాన్ని కార్పొరేట్ గుత్తేదారులైన అంబానీ, ఆధానిల చేతిలో కేంద్ర ప్రభుత్వ స్టీరింగ్ పెట్టారని మండిపడ్డారు. రైతులకు మద్దతు తెలిపిన విదేశీ గాయనీకి దేశ అంతర్గత వ్యవహారంలో ఏం అవసరమని ప్రశ్నించిన బీజేపీ నేతలు..రాష్ట్ర బ్రిటిష్ హైకమిషనర్ ఆండ్రు ఫ్లెమింగ్ ను కలిసి దుబ్బాక ఉప ఎన్నికల గురించి చర్చించినట్లు దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు ట్విట్టర్ లో పోస్ట్ చేశారని, ప్రజాస్వామ్య బద్దంగా జరిగిన ఈదేశ ఎన్నికల గురించి బ్రిటిష్ హై కమిషనర్ తో ఎలా చర్చిస్తారని, ఆయనకు ఇక్కడి అంశాలతో ఏం పనో చెప్పాలన్నారు. బండి సంజయ్ కు ఇవేం కన్పించవని, దేశభక్తి, దేశ ద్రోహం సర్టిఫికేట్ ఇవ్వడానికి ఈయన ఎంపీగా గెలిచారా అని ప్రశ్నించారు. రాష్ట్ర అధ్యక్షుడు అయ్యాక కరీంనగర్ ను ఆయన మర్చిపోయారన్నారు. ప్రజల మధ్య విద్వేషాలు రగిల్చే మాటలు..ఆలోచనకు దూరంగా ఉండే లేనిపోని అపోహలు సృష్టించే బండి సంజయ్ అండ్ కంపెనీ మాటలు నమ్మవద్దని తెలంగాణ ప్రజానీకాన్ని కోరారు.

తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న కథలాపూర్ మండల కేంద్రానికి చెందిన వ్యక్తికి టి ఆర్ కె ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 13 : (నేటినిజం ప్రతినిధి):వేములవాడ నియోజకవర్గంలోని కథలపూర్ మండల కేంద్రానికి చెందిన గడ్డం బావయ్య అనే 40 సంవత్సరాల వ్యక్తి గత మూడు ఏండ్లుగా గొంతు వద్ద కంటితో బాధపడుతుండగా వేములవాడకు చెందిన టి ఆర్ కే ట్రస్ట్ స్పందించి శనివారం రోజున అతని ఇంటి వద్ద కు తరలి వెళ్లి ఆర్థిక సహాయం అందజేసింది. ట్రస్ట్ చైర్మన్ రామ్ కుమార్ ఆదేశాల మేరకు ట్రస్ట్ డైరెక్టర్ మహేష్ కుమార్ నేతృత్వంలో టీం సభ్యులు కథలాపూర్ లోని బావయ్య ఇంటికి తరలి వెళ్లి వారిని పరామర్శించడమే కాకుండా ఆర్థిక సహాయం కూడా అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ డైరెక్టర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ గొంతు వద్ద ఏర్పడిన కంతి వల్ల గత మూడు సంవత్సరాలుగా అనేక రకాలుగా చికిత్స తీసుకున్నప్పటికీ రోజురోజుకీ పరిస్థితి విషమిస్తుంది అని వైద్య ఖర్చులకు సొంత వ్యవసాయ భూమి తో పాటు ఇంట్లో ఉన్న బంగారం తదితర వస్తువులు అమ్మి నప్పటికీ ఆరోగ్యం కుదుట పడలేదని విషయం తెలుసుకుని శనివారం రోజున 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. బావయ్య భవిష్యత్తు వైద్య ఖర్చుల నిమిత్తం కూడా మరింత సహాయ సహకారాలు తప్పనిసరిగా అందజేస్తామని వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. అనంతరం బాధితుడు గడ్డం బావయ్య అతని భార్య అంజమ్మ టి ఆర్ కే ట్రస్టు కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లో కథలాపూర్ జెడ్ పి టి సి గంగారాం, ఎంపీటీసీ గసికంటి వేణు,వి డీసీ చైర్మన్ అశోక్ టి ఆర్ కె ట్రస్ట్ ప్రతినిధులు శ్రీధర్, సంతోష్ ,వెంకటేష్ తదితరులు ఉన్నారు. కార్యక్రమం అనంతరం కథలాపూర్ గ్రామ శివార్లలోని నిర్మాణంలో ఉన్న రామాలయాన్ని సందర్శించి ఆలయ అభివృద్ధి కోసం టి ఆర్ కె ట్రస్టు తరఫున ఆర్థిక సహాయం చేస్తామని తెలిపారు.

పబ్బం గడుపుకోవడానికే షర్మిల ఇక్కడికి వచ్చారు: మంత్రి

హైదరాబాద్,ఫిబ్రవరి13(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో షర్మిల రాజకీయ పార్టీపై పర్యటక, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ స్పందించారు. షర్మిల ఎవరి బాణం కాదని..

ఏపీలో ఏం చేయలేకనే ఇక్కడకు వచ్చారని ఎద్దేవా చేశారు. పరాయి నేతలు వద్దు అనే ఉద్దేశంతోనే సొంత రాష్ట్రం తెచ్చుకున్నామని మంత్రి స్పష్టం చేశారు. చిరంజీవి, పవన్ కల్యాణ్ రాజకీయ పార్టీలు పెట్టారు.. ఏమైందో ప్రజలు చూశారని మంత్రి పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ పథకాలను దేశమే కాపీ చేస్తోందని.. ఎవరు వచ్చినా ఇబ్బంది లేదని అన్నారు. మాజీ సీఎం రాజశేఖర్ రెడ్డి మరణించి ఏళ్లు గడిచిపోయిందని గుర్తు చేశారు

రైతుల సంక్షేమం కోసమే రైతు వేదికలు: మంత్రి అల్లోల

నిర్మల్,ఫిబ్రవరి13(ఆర్ఎన్ఎ): రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని, అందుకే సీఎం కేసీఆర్ వ్యవసాయరంగానికి మొదటి ప్రాధాన్యతనిచ్చి వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారని మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. జిల్లాలోని మామడ మండలం పొన్కల్‌లో రైతువేదిక భవనాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కో సం తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందని, వాటిని అమలు చేస్తూ రైతును రాజులా చూస్తుం దన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సాగునీటి వసతి, 24 గంటల విద్యుత్, రైతుబంధు, రైతు బీమాను ప్రవేశపెట్టి రైతులను కంటికి రెప్పలా చూసుకుంటున్నదని చెప్పారు. రాష్ట్రంలో కరెంటుకు, నీళ్లకు కొదువ లేదని..



ఒకే వేదికలో రైతులందరూ కలిసి ఏయే పంటలు పండించుకోవాలో నిర్ణయించుకుని వాటిని సాగుచేయాలని సూచించారు. గ్రామంలో వ్యవసాయశాఖ అధికారి సలహాలు, సూచనలతో పంటలు వేయాలని కోరారు.

కెజి టూ పిజి పట్టాలకెక్కిస్తేనే మేలు

సామాన్యులకు విద్య అందుబాటులోకి రావాలి

హైదరాబాద్,ఫిబ్రవరి13(ఆర్ఎన్ఎ): తెలంగాణలో గతంతో పోలిస్తే విద్యారంగంలో అనేక విప్లవాత్మక మార్పులు కనిపిస్తున్నాయి.

గురుకులాల ఏర్పాటు వల్ల సామాన్యులకు నాణ్యమైన ఉచిత విద్య అందుబాటులోకి వచ్చింది. అయితే తెలంగాణలో కెజి టూ పిజి విద్యకు ప్రణాళిక ప్రకటించినా ఎందుకనో అది పట్టాలకెక్క లేదు. నిజానికి కులమతాలకు అతీతంగా విద్యను అందిస్తానని సిఎం కెసిఆర్ పలుమార్లు ప్రకటించారు. సామాన్యుడి నుంచి, రాజకీయ నాయకుల, అధికారుల పిల్లలంతా ఒకే విద్యావిధానంలో చదవాలన్న ఆకాంక్షను ప్రకటించారు. కులరహిత హాస్టళ్లు ఉండకూడదని కూడా చెప్పారు. ఇంతటి ఉదాత్తమైన పథకం ఎందుకనో ముందుకు సాగడం లేదు. నిజానికి ఇప్పటి వరకు సిఎం కెసిఆర్ చేస్తున్న పథకాలు ఒక ఎత్తయితే ఈ పథకం ఒక ఎత్తయ్యేది. తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేది. కామన్ ఎడ్యుకేషన్ అన్నది సమాజాంలో అంతరాలను తొలగిస్తుంది. అది ఎల్‌కెజి నుంచే పిల్లల్లో భేదభావాలు లేకుండా చేస్తుంది. ఇప్పుడున్న స్కూళ్లను చూస్తుంటే ఆర్థికస్థాయిని బట్టి నడుపుతున్నారు. అయితే ఈ ప్రతిపాదన పరిశీలనలో ఉండగానే గురుకులాలు, ఉర్దూమీడియం స్కూళ్లు ప్రారంభించడం, అనేక హాస్టళ్లను కొత్తగా చేపట్టడం వల్ల పథకం అటకెక్కిందన్న భావన కలుగుతోంది. ప్రస్తుతానికి ఈ ప్రయత్నాలు కూడా మంచి ఫలితాలే ఇస్తున్నాయి. విద్యారంగానికి ప్రభుత్వం కూడా అధిక బడ్జెట్ కేటాయింపులు చేసి అన్ని శాఖలు సమిష్టి కృషి చెయ్యాలి. ఈ ఫలితాలు పొందిన క్రీడాకారులు భావి క్రీడాకారులను ప్రోత్సహించాలి.విద్యా ఉద్యోగాల్లో క్రీడాకారులకు రెండు శాతం రిజర్వేషన్లను వర్తింప చేస్తూ తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే తీసుకున్న నిర్ణయం కారణంగా క్రీడాభివృద్ధికి దోహదం చేస్తుందని విద్యారంగ నిపుణులు సైతం అభినందిస్తున్నారు. ఇది ఓ రకంగా క్రీడాకారులకు ఎంతో మేలు చేసే నిర్ణయంగా చూడాలి. దీంతో తమకు ఉద్యోగాలు దక్కగలవన్న భరోసా వారిలో ఏర్పడింది. ఇప్పటికే అనేక మంది క్రీడాకారులను వెన్నుతట్టి ప్రోత్సహిస్తునన తీరు గతంలో ఎప్పుడూ జరగలేదు. తమ ప్రతిభ ద్వారా దేశానికి, రాష్ట్రాలకి కీర్తి ప్రతిష్టలు తెచ్చి పెట్టే క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించడం ఆయా రాష్ట్రాల ప్రభుత్వాల బాధ్యత. ర్యాంక్‌లు, మార్కులకోసం పోటీపడే ప్రస్తుత కాలంలో ఆటలు ఆడితే పిల్లలు పాడవుతారని, చదువుల్లో వెనకబడతారనే తల్లిదండ్రులు ఆలోచిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు క్రీడా సాంస్కృతిక కళల పట్ల ఆసక్తి చూపించడం లేదు. దానికి కారణాలు కూడా లేక పోలేదు. గ్రామస్థాయిలో సరైన సదుపాయాలు లేకపోవడం, క్రీడలను ప్రోత్సహించేలా పరికాలు, క్రీడా సామాగ్రి లేకపోవడం, ఆడుకోవడానికి మైదానాలు లేకపోవడం వంటి కారణాలూ ఉన్నాయి. విద్యా సంస్థలు సైతం వీటిని ప్రోత్సహించడం లేదు. హైదరాబాద, తదితర పట్టణాల్లో కార్పోరేట్ స్కూల్ కల్చర్ వచ్చాక క్రీడలను పూర్తిగా విస్మరించారు. కేవలం ఇరుకుగదుల్లో పిల్లలను బందీలను చేశారు. పుస్తకాలను బట్టీ పట్టించడం తప్ప మరోటి వారికి తెలియకుండా చేస్తున్నారు. క్రీడా పోటీలలో పాల్గొన్న విద్యార్థులు ఏక కాలంలో చదువులపై, ఆటలపై దృష్టి సారించలేరు. అటువంటి విద్యార్థులకు ఉన్నత చదువులలో రిజర్వేషన్ సౌకర్యం ఉండాలి. ఉద్యోగాలలో రిజర్వేషన్ల వల్ల క్రీడాకారులకు భవిష్యత్ ఉపాధికి హామీ ఉంటే క్రీడల్లో తమ పిల్లల్ని ప్రోత్స హించే తల్లిదండ్రుల సంఖ్య క్రమంగా పెరగడానికి అవకాశాలు ఉంటాయి.అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు, ఎయిడెడ్ సంస్థల్లో దాదాపు 29 క్రీడాంశాలలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారు లకు ఈ రిజర్వేషన్ సౌకర్యం వర్తించే విధం గా ఉత్తర్వులు జారీ చేయడం వల్ల తెలం గాణ లో మార్పు కనిపిస్తుందనడంలో సందే హం లేదు. తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన తరువాత పలు సందర్భాల్లో క్రీడారంగ రిజర్వేషన్లపై అనేక విజ్ఞప్తులు వచ్చాయి. ఇలా అన్ని రంగాల్లో విద్యార్థులు విజయాలు సాధి ంచే లా మన విద్యారంగాన్ని తీర్చిదిద్దుకోవాలి.

క్రీడారంగానికి ప్రోత్సాహం పెరగాలి

మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలి

హైదరాబాద్,ఫిబ్రవరి13(ఆర్ఎన్ఎ): క్రీడలకు సరైన ప్రోత్సహకాలు లేక ఎంతోమంది భావి క్రీడాకారులు మట్టిలో మాణిక్యాలవలే మిగిలిపోయారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు కూడా దినసరి కూలీలాగా చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ కాలం వెళ్ళదీస్తున్న ఘటనలు చూస్తూనే ఉన్నాం. అలాగే క్రీడాకారులకు ఉద్యోగాల్లో 2శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. తాజాగా నిజామబాద్ నుంచి సైమ్య ఫుట్‌బాల్‌కు ఎన్నిక కావడం ఆనందించదగ్గ విషయం. ప్రబుతంవ ప్రోత్సాహం కూడా ఇందుకు దోహదపడింది. సీఎం కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీ మేరకు క్రీడా రిజర్వేషన్లను అమలు చేయాలని నిర్ణయించడం ద్వారా వారిలో ప్రోత్సాహాన్ని నింపారు. దొంగ సర్టిఫికెట్లకు అవకాశం లేకుండా నిజమైన క్రీడాకారులకు రిజర్వేషన్ల ఫలాలు దక్కేలా చేయాలి. అందుకు అనుగుణంగా పాఠ్యాంశాలను, కరికులమ్‌ను మార్చాలి. పాఠశాల స్థాయి నుంచి నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి భవిష్యత్తులో సామాజిక మార్పుకు దోహదపడుతుందని రుజువు చేయాలి. అలాగే ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు చదువును కొనే దుస్థితి నుంచి బయటపడేలా చేయాలి. సామాన్యులకు చదవును దగ్గర చేసేందుకు ఎంతయినా ఖ్యార్చు చేయాలి. అప్పుడే విద్యారగం పటిష్టం కాగలదు. ప్రజలపై ఆర్థిక భారం తగ్గగలదు. లేకుంటే విద్య కోసం పేదలు సైతం లక్షల్లో ఖర్చు చేసేందుకు అప్పుల బారిన పడుతున్నారు. కార్పోరేట్ స్కూళ్ఫీజు దోపిడీలను అరికట్టాలి. నిర్ణీత ఫీజులు ఉండేలా చూడాలి. అందుకు తెలుగు రాష్ట్రాల్లో సాగుతున్న కృషి మరింత ముందుకు సాగాలి.

'వ్యవసాయ చట్టాలు అమలైతే అదానీ గోదాముల్లోకి పప్పుధాన్యాలు'

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: వ్యవసాయ చట్టాలపై నరేంద్ర మోదీ సర్కార్ లక్ష్యంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ శనివారం తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. వివాదాస్పద సాగు చట్టాల అమలుతో దేశంలో నిరుద్యోగం తాండవిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

వ్యవసాయం భారత మాతకు చెందిందని, పారిశ్రామికవేత్తలది కాదని రాజస్థాన్‌లోని రూపన్‌గఢ్‌లో జరిగిన రైతు ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతూ పేర్కొన్నారు. ప్రధాని రైతుల ముందు ప్రతిపాదనలు ఉంచానని చెబుతున్నారని, వారికి ఆకలి, నిరుద్యోగం, ఆత్మహత్యలను ఆయన ఆప్షన్‌లుగా ఇచ్చారని అన్నారు.

భారత్‌లో ఇవాళ పప్పు ధాన్యాల మార్కెట్ ఓ పారిశ్రామికవేత్త కనుసన్నల్లో నడుస్తోందని అదానీ పేరు ప్రస్తావించకుండా రాహుల్ వ్యాఖ్యానించారు. పప్పు ధాన్యాల్లో 40 శాతం వరకూ ఆయన గోదాముల్లో మగ్గుతున్నాయని, రెండవ వ్యవసాయ చట్టం పప్పు ధాన్యాలపై 80-90 శాతం నియంత్రణను అదానీకి కట్టబెడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సాగు చట్టాలు అమలైతే దేశంలో యువతకు ఉద్యోగాలు కరువవుతాయని హెచ్చరించారు. దేశంలో వ్యవసాయ వ్యాపారాన్ని మొత్తం తన సన్నిహిత మిత్రులకు కట్టబెట్టాలని ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని రాహుల్ ఆరోపించారు. మరోవైపు కాంగ్రెస్ నేతలు వ్యవసాయ చట్టాలపై రైతులను తప్పుదారి పట్టిస్తున్నారని బీజేపీ నేత అనురాగ్ ఠాకూర్ ఆరోపించారు. ఈ చట్టాలతో రైతుల ఆదాయం రెట్టింపవుతుందని అన్నారు.

ఏడుపాయల జాతర ఆదాయం రూ. 31.55 లక్షలు

మెదక్, ఫిబ్రవరి 13: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గామాత క్షేత్రంలో జరిగిన మాఘ అమావాస్య జాతర ఆదాయం రూ.31.55 లక్షలు వచ్చిన్నట్లు దేవాదాయశాఖ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి, ఈవో సార శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మాఘ అమావాస్య జాతరకు సంబంధించిన ప్రసాద, ప్రత్యేక దర్శనాలు, ఒడిబియ్యం, కేషఖండనంతో పాటు 35 రోజుల హుండీ లెక్కింపు కార్యక్రమం గోకుల్ షెడ్డులో నిర్వహించారు. కార్యక్రమంలో భ్రమరాంభిక సేవా సమితి కామారెడ్డి, సత్యసాయి సేవా సమితి సిరిసిల్ల సభ్యుల ఆధ్వర్యంలో లెక్కింపు కొనసాగింది. కార్యక్రమంలో భ్రమరాంభిక, సత్యసాయి సేవా సమితి సభ్యులు సునీతా శ్రీనివాస్‌రెడ్డి బృందంతో పాటు సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, లక్ష్మీ నారాయణ, పత్రాప్‌రెడ్డి, మహేశ్, విఠల్, యాదగిరి, నర్సింహులు పాల్గొన్నారు. ఎస్ఐ సురేశ్ బందోబస్తు నిర్వహించారు.

అరకు ఘటనపై మంత్రుల తీవ్ర దిగ్భ్రాంతి

కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణ కమిటీ ఏర్పాటు

వెల్లడించిన మంత్రులు ఆళ్లనాని, అవంతి శ్రీనివాస్

డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమన్న ఆర్డీవో

విశాఖపట్నం,ఫిబ్రవరి13(ఆర్ఎన్ఎ): అరకు ప్రమాద ఘటనపై కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేస్తున్నామని మంత్రి ఆళ్ల నాని శనివారం తెలిపారు. అరకు ఘటనపై విచారణ కోసం కమిటీ ఏర్పాటు చేసినట్లు మంత్రులు ఆళ్లనాని, అవంతి శ్రీనివాస్ తెలిపారు. జాయింట్ కలెక్టర్, డీటీసీ, పాడేరు సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణ జరుగుతుందని పేర్కొన్నారు. బ్రేకులు ఫెయిల్ అవడంతోనే ప్రమాదం జరిగిందని డ్రైవర్ చెప్పినట్లు మంత్రులు చెప్పారు. ఘటనలో 16 మంది సురక్షితంగా బయపడ్డారని, ఒక మహిళకు తీవ్ర గాయాలయ్యాయని చెప్పారు. ఈ ప్రమాద ఘటన బాధాకరం అని మంత్రులు అన్నారు. తెలంగాణ నుంచి 27 మంది అరకు ప్రాంతానికి వచ్చారని, ప్రమాదంలో నలుగురు మృతి చెందారని తెలిపారు.

బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని వెల్లడించారు. ప్రత్యేక అంబులెన్స్‌లో స్వస్థలాలకు పంపే ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అంతకు ముందు అరకు ఘాట్‌రోడ్ ప్రమాద ఘటనలో గా

రాజ్యసభ కొత్త ప్రతిపక్ష నేతగా మల్లికార్జున ఖర్గే

ఛైర్మెన్‌కు ప్రతిపాదించిన కాంగ్రెస్

కాంగ్రెస్ పార్టీ కోసం ఖర్గే ఎంతో కష్టపడ్డారని పలువురి వ్యాఖ్య

న్యూఢిల్లీ,ఫిబ్రవరి13(ఆర్ఎన్ఎ): ఫిబ్రవరి 15న రాజ్యసభ సభ్యత్వం నుంచి పదవీవిరమణ పొందనున్న కాంగ్రెస్ సీనియర్ నేత పెద్దల సభలో ప్రతిపక్షనేత గులాం నబీఆజాద్ స్థానంలో మరో సీనియర్ నేత మల్లికార్జున ఖర్గేను కాంగ్రెస్ నియమించింది. గులాం నబీ ఆజాద్ రిటైర్ అయ్యాక రాజ్యసభలో ప్రతిపక్షనేతగా ఖర్గే వ్యవహరించనున్నారు. ఇదే విషయాన్ని రాజ్యసభ ఛైర్మెన్ వెంకయ్యనాయుడుకు సమాచారం ఇచ్చింది కాంగ్రెస్. మంగళవారం నలుగురు రాజ్యసభ సభ్యులు రిటైర్ కానున్నారు. వీరిలో ఒకరిగా గులాంనబీ ఆజాద్ ఉన్నారు. ఇప్పటికే రిటైర్ కానున్న ఆజాద్ గురించి ప్రధాని భావోద్వేగంతో కూడిన ప్రసంగం పెద్దల సభలో చేశారు. ఆ సమయంలో గులాం నబీ ఆజాద్ సేవలను కొనియాడుతూ అతనితో తనకున్న సన్నిహితాన్ని ప్రధాని మోడీ గుర్తు చేసుకున్నారు. అంతేకాదు ఆజాద్ గురించి మాట్లాడుతూ ఒక్కసారిగా కళ్లల్లో నీళ్లు పెట్టుకున్నారు ప్రధాని మోడీ. ఆజాద్ అటు పార్టీ కోసం కృషి చేస్తూనే ఇటు దేశ ప్రయోజనాలను కాపాడటంలో విలువైన సలహాలు సూచనలు చేశారని అలాంటి నేత లోటును భర్తీ చేయలేమని మోడీ చెప్పారు. ఇక రాజ్యసభలో ప్రతిపక్షనేతగా కర్నాటకకు చెందిన సీనియర్ నేత మాజీ కేంద్ర మంత్రి మల్లికార్జున ఖర్గే బాధ్యతలు చేపడతారు. నలుగురు గాంధీ కుటుంబ సభ్యుల నేతృత్వంలో ఖర్గే పనిచేశారు. కాంగ్రెస్ పార్టీ కోసం ఖర్గే ఎంతో కష్టపడ్డారని ఆ పార్టీ పెద్దలు కొనియాడారు. 2014లో ఎన్డీఏ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రాజ్యసభలో ప్రతిపక్షనేతగా ఆజాద్ కొనసాగుతూ వస్తున్నారు.1990లో తొలిసారిగా రాజ్యసభకు గులాంనబీ ఆజాద్ ఎన్నికయ్యారు. గాంధీ కుటుంబానికి విధేయుడనే గుర్తింపు ఉన్న ఆజాద్... కాంగ్రెస్‌లో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని గొంతెత్తిన వారిలో ఒకరిగా నిలిచారు ఆజాద్. ఇదిలా ఉంటే ఏప్రిల్ వరకు మళ్లీ రాజ్యసభ ఎన్నికలు లేవు. అయితే కేరళలో రాజ్యసభ సీట్లు ఖాళీ అవుతున్నప్పటికీ తిరిగి ఆజాద్‌ను అక్కడి నుంచి పెద్దల సభకు పంపాలంటే పలు సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉంది. అయితే చిదంబరం, దిగ్విజయ్ సింగ్, ఆనంద్ శర్మలు కూడా ప్రతిపక్ష నేతకు పోటీలో ఉన్నప్పటికీ ఖర్గే వైపే కాంగ్రెస్ అధిష్టానం మొగ్గు చూపింది.లోక్‌సభ ప్రతిపక్షనేతగా 2014-2019 సభలో వ్యవహరించిన అనుభవం ఉన్న నేపథ్యంలో ఖర్గే వైపే అధిష్టానం నిలిచిందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి.

పైవేట్ టీచర్ల ఉసురు పోసుకోవద్దు

వారికి వెంటనే జీతాలు చెల్లించాలి

లెక్చరర్ ఆత్మహత్యపై తీవ్రంగా స్పందించిన బండి సంజయ్

హైదరాబాద్, ఫిబ్రవరి13(ఆర్ఎన్ఎ): ప్రైవేటు, కార్పొరేట్ సంస్థల లెక్చరర్లు, టీచర్లకు వెంటనే వేతనాలు చెల్లించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ డిమాండ్ చేశారు. చైతన్యపురిలో జూనియర్ కాలేజీ లెక్చరర్ డా.హరినాథ్ జీతాలు లేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన బండి సంజయ్ హరినాథ్ ఆత్మహత్యాయత్నం తనను కలిచి వేసిందన్నారు. ప్రయివేటు, కార్పొరేట్ సంస్థలు లెక్చరర్లు, టీచర్లకు వెంటనే వేతనాలు చెల్లించాలన్నారు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్. కార్పొరేట్ స్కూళ్ళు, జూనియర్ కాలేజీలు టీచర్లు, లెక్చరర్లకు వెంటనే జీతాలు చెల్లించా లన్నారు. చైతన్యపురి లోని శ్రీ చైతన్య జూనియర్ కాలేజీ లెక్చరర్ డా.హరినాథ్ జీతాలు లేక ఆత్మహత్యాయత్నం చేయడం కలిచి వేసిందన్నారు. ఎంతో మంది విద్యార్థుల్ని తీర్చిదిద్దిన అధ్యాపకులను జీతాలివ్వకుండా వేధించి, వాళ్ళ ఉసురు పోసుకోవద్దని బండి సంజయ్ సూచించారు. సిబ్బంది ఇన్నాళ్లు శ్రమించడం వల్లనే కార్పొరేట్ సంస్థలు కోట్లు సంపాదించుకుని ఇప్పుడు వారిని రోడ్డున పడేయడం అమానవీయం అన్నారు. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తూ, అధ్యపకులను మాత్రం వేతనాలు ఇవ్వకుండా వేధిస్తారా ? అని ప్రశ్నించారు. టీచర్లు, లెక్చరర్లకు జీతాలు ఇవ్వక పోతే ఆయా సంస్థల సిబ్బందే కార్పొరేట్ కాలేజీలను ముట్టడించే పరిస్థితి తెచ్చుకోవద్దని బండి సంజయ్ సూచించారు.

23 నుంచి జేఈఈ మెయిన్

-అడ్మిట్ కార్డులు విడుదల చేసిన ఎన్‌టీఏ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి13(ఆర్ఎన్ఎ): దేశంలోని ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థలైన ఐఐటీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ మెయిన్ అడ్మిట్ కార్డులను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) విడుదల చేసింది. ఈ పరీక్షల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. జేఈఈ పరీక్షలు ఈ నెల 23 నుంచి 26 వరకు జరుగనున్నాయి. విద్యార్థుల సౌలభ్యం కోసం ఎన్‌టీఏ మూడు వేరువేరు లింక్‌లను అందుబాటులో ఉంచింది. దీనిద్వారా అడ్మిట్ కార్డులను సులభంగా, వేగంగా డౌన్‌లోడ్ చేసుకోవడానికి వెసులుబాటు కలుగుతుందని తెలిపింది. కాగా, ఈ ఏడాదినుంచి జేఈఈ మెయిన్ పరీక్షను ఒకటికంటే ఎక్కువసార్లు రాసుకునే అవకాశం ఉన్నది. జేఈఈకి అర్హత సాధించాలంటే విద్యార్థులు 12 తరగతి పాసవ్వాల్సి ఉంటుంది. ఈ ఏడాది జేఈఈ మెయిన్ కోసం 6.60 లక్షల మంది విద్యార్థులు తమ పేర్లను రిజిస్టర్ చేసుకున్నారు.

కేంద్రంతో అమీ తుమీ

కొత్త చట్టాలు రైతులకు అమోదయోగ్యం కావు

నిరవధికంగా నిరసనలు చేస్తాం

భారతీయ కిసాన్ యూనియన్ నాయకుడు రాకేశ్ టికాయత్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి13(ఆర్ఎన్ఎ): సాగు చట్టాల రద్దు కోరుతూ దేశ రాజధాని దిల్లీ సరిహద్దుల్లో చేపట్టిన నిరసనలను నిరవధికంగా కొనసాగిస్తామని 'భారతీయ కిసాన్ యూనియన్' (బీకేయూ) నాయకుడు రాకేశ్ టికాయత్ వెల్లడించారు. నిరసనలు ఎంతకాలం కొనసాగించాలనే వ్యవధిపై నిర్ణయమేదీ తీసుకోలేదని.. ఇవి అక్టోబర్ వరకూ కొనసాగవచ్చని ఆయన తెలిపారు. అంతేకాకుండా ప్రతి ఏడాది గాంధీ జయంతి రోజున రైతు నిరసన ప్రదర్శనలు చేపడతామని ప్రకటించారు. "ఈ వ్యవసాయ చట్టాలు రైతులకు అమోదయోగ్యం కావు. వాటిని రద్దు చేయకపోవటం వెనుక ఉన్న కారణం ఏమిటో వివరించాలి" అని ప్రభుత్వాన్ని టికాయత్ డిమాండ్ చేశారు. రైతు నిరసనలపై పార్లమెంటులో చర్చ జరగటంపై టికాయత్ హర్షం వ్యక్తం చేశారు. దేశాన్ని నడిపిస్తోంది నలుగురే అన్న రాహుల్ వ్యాఖ్యలతో ఆయన ఏకీభవించారు. తమ ప్రదర్శన అక్టోబర్ వరకూ కొనసాగుతుందని.. మరో రైతు సంఘం 'సంయుక్త్ కిసాన్ మోర్చా' నేత గుమ్‌నాబ్ సింగ్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

దేశ ప్రాణం రైతులే, వారిని కాపాడాలి-కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా

రైతులు దేశానికి ప్రాణమని, దేశ ప్రాణాలు కాపాడాలంటే రైతులను కాపాడాలనీ కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా అన్నారు. శుక్రవారం తన ట్విట్టర్ ఖాతా ద్వారా వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు చేస్తున్న ఆందోళనపై స్పందిస్తూ మోదీ ప్రభుత్వంపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. "రైతులే దేశానికి ప్రాణం. దేశం ప్రాణాలు కాపాడాలంటే రైతుల్ని కాపాడాలి. రైతులను కాపాడితే దేశాన్ని కాపాడినట్లే. రైతులకు మద్దతుగా పెద్ద ఎత్తున ముందుకు రావాల్సిన అవసరం ఉంది" అని యశ్వంత్ సిన్హా వ్యాఖ్యానించారు.మోదీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పదునైన విమర్శలతో విరుచుకుపడుతున్న యశ్వంత్ సిన్హా.. గతంలో అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వంలో మంత్రిగా కొనసాగారు. అద్వాణీ, అటల్‌లకు సన్నిహితుడిగా పేరున్న యశ్వంత్‌కు మోదీపై మొదటి నుంచి వ్యతిరేకత ఉందని రాజకీయాలు ఎరిగిన వారు చెప్తుంటారు.

పట్టభద్ర ఎన్నికలపై మంత్రి సమీక్ష

-టిఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలని సూచన

వనపర్తి,ఫిబ్రవరి13(ఆర్ఎన్ఎ): మట్టిని నమ్మిన రైతుకు, ప్రజలను నమ్మిన రాజకీయ పార్టీకి ఓటమి లేదని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. వనపర్తిలోని నాగవరం శ్రీనివాస పద్మావతి గార్డెన్‌లో జరిగిన మహబూబ్ నగర్ - రంగారెడ్డి - హైదరాబాద్ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల విస్తృతస్థాయి సమావేశం, టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. గులాబీ జెండా అండ లేకుండా నాతో సహా ఎవరూ లేరన్నారు. పార్టీ అనేది పచ్చని చెట్టు లాంటిది. దానిని కాపాడుకుంటే ఫలితాలు ఇస్తుంది. ప్రతి కార్యకర్తకు పార్టీ పరంగా అండగా నిలుస్తామన్నారు. ఆరున్న రేండ్లలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో జరిగిన అభివృద్ధిని మించి దేశంలోని 27 రాష్ట్రాల్లో ఎక్కడైనా జరుగుతుందా అని ప్రశ్నించారు. పార్టీ సభ్యత్వ నమోదు పక్రియ పకడ్బందీగా జరుగాలన్నారు. రైతులు, పథకాల లబ్దిదారులను పార్టీ సభ్యత్వ నమోదులో భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. శాసన మండలి ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపుకు చిత్తశుద్ధితో కృషిచేయాలన్నారు. అనంతరం ప్రమాదవశాత్తు చనిపోయిన నలుగురు పార్టీ కార్యకర్తల కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున పార్టీ బీమా చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో సభ్యత్వ నమోదు ఇంచార్జి, పార్టీ ప్రధాన కార్యదర్శి భరత్ కుమార్ గుప్తా, జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నరసరావుపేటలో వైకాపా ఆగడాలు: టిడిపి

గుంటూరు,ఫిబ్రవరి13(ఆర్ఎన్ఎ): నరసరావుపేట నియోజకవర్గంలో అధికార పార్టీ ఎన్నో ఆటంకాలు సృష్టించిందని టీడీపీ ఇన్‌చార్జ్ చదలవాడ అరవింద్ బాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ నామినేషన్‌లు వేయకుండా అడ్డుపడ్డారని...పోలింగ్ కేంద్రాలకు రాకుండా రాత్రంతా బెదిరిస్తూనే ఉన్నారన్నారు. దళిత, మైనారిటీ, బీసీ వర్గాలను సంక్షేమ పథకాలు రావని బెదిరించారని తెలిపారు. అయితే అన్నింటినీ ఎదుర్కొని ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసేందుకు వచ్చారన్నారు. కౌంటింగ్ సమయంలో అల్లర్లు చేయడానికి వైకాపా శ్రేణులు కుట్ర పన్నారని ఆరోపించారు. జిల్లా యంత్రాంగం కౌంటింగ్ పూర్తి అయ్యే వరకు నరసరావుపేట నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అరవింద్ బాబు కోరారు.

చిట్టడవుల పెంపకం, నూతన ప్రాజెక్టుల ఏర్పాటులో

కరీంనగర్ పోలీసుల శ్రద్ధాసక్తులు ప్రశంసనీయం

-ముఖ్యమంత్రి కార్యాలయం ఓఎస్‌డి ప్రియాంక వర్గీస్

కరీంనగర్, ఫిబ్రవరి 13: (నేటినిజం ప్రతినిధి):మియావాకి పద్ధతిలో యాదాద్రిమోడల్ చిట్టడవులు నిర్మాణం, హరితహారంలో భాగంగా వేలాది మొక్కలను నాటుతూ సంరక్షింపబడటం, పలునూతన ప్రాజెక్టుల ఏర్పాటుపై కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు కనబరుస్తున్న శ్రద్ధాసక్తులు ప్రశంసనీయమైనవని రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం హరితహారం, వనాల అభివృద్ధి విభాగం ఓఎస్‌డి ప్రియాంకవర్గీస్ అన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాలనే తపనతో ఈ ప్రాజెక్టులు చేపట్టడం ఊహించలేనిదని, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ఎక్కడా పోలీసులు పర్యావరణ పరిరక్షణ కోసం ఇంతటిస్థాయి పటిష్ట చర్యలు తీసుకోలేదని చెప్పారు.

కరీంనగర్‌లోని కమిషనరేట్ పోలీసు శిక్షణకేంద్రం(సిటిసి)లో యాదాద్రిమోడల్ చిట్టడవులు నిర్మాణం, హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు, నూతన ప్రాజెక్టుల ఏర్పాటులో భాగంగా నిర్మాణంలో నవగ్రహ, రాశి,నక్షత్ర వనాలు, చేపలపెంపకం విధానాన్ని శనివారం నాడు రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం హరితహారం, వనాల పెంపకం విభాగం ఓఎస్‌డి ప్రియాంకవర్గీస్ సందర్శించారు. వనాలు, వివిధ రకాల నూతన ప్రాజెక్టుల నిర్మాణాలను క్షుణ్ణంగా పరిశీలించడంతోపాటు, తీసుకుంటున్న చర్యలను అడిగితెసుకోవడంతోపాటు కొన్ని రకాల సంరక్షణ చర్యలను సూచించారు.

ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో ఓఎస్‌డి ప్రియాంకవర్గీస్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం లక్ష్యాలను చేరడంలో భాగంగా కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు పర్యావరణ పరిరక్షణ చర్యల్లో భాగంగా మియావాకి పద్ధతిలో చిట్టడువుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం, నాటిన ప్రతిమొక్కను సంరక్షించేందుకు తీసుకుంటున్న చర్యలతో ముందుకుసాగుతున్నదన్నారు. రాష్ట్రంలో మరెక్కడా పోలీసులు పర్యావరణ పరిరక్షణ కోసం ఇంతటిస్థాయిలో శ్రద్ధాసక్తులను కనబరిచిన దాఖలాలులేవని చెప్పారు. ఇక్కడి పోలీసుల్లో పర్యావరణం పట్ల వారికున్న ప్రేమ, శ్రద్ధాసక్తులు, మానవమనుగడకు ప్రశ్నార్థకంగా మారిన పరిస్థితుల నేపథ్యంలో సాహసంతోకూడిన ఈ ప్రాజెక్టుల ఏర్పాటుకు అంకితభావంతో సిద్ధకావడం అమూల్యమైనదని తెలిపారు.

మరో బయోడైవర్శిటిని తలపిస్తోంది

ఈ ప్రాంతాన్ని సందర్శిస్తుంటే జీవ వైవిధ్య ఉద్యానంల(బయోడైవర్శిటి) మధ్యన ఉన్నట్లుగా భావిస్తున్నాని, అటవీశాఖ, ఉద్యానశాఖలకు చెందిన నూతన ఉద్యోగులు శిక్షణలో భాగంగా ఈ ప్రాంతాన్ని సందర్శించే విధంగా రూపొందించబడిన తీరులో పోలీసుల్లోని కృష్టిపట్టుదల,ప్రభుత్వలక్ష్యసాధనదిశగా ముందుకుసాగుతుండటం స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు. మియావాకి ప్రాజెక్ట్-1 ఏర్పాటు, ప్రాజెక్టు-2ఏర్పాటు మధ్య ఏర్పడిన ఆటంకాలు, అధిగమించిన అవరోధాలను అడిగితెలుసుకున్నారు. జిల్లాలో పనిచేస్తున్న అన్నిప్రభుత్వశాఖల సమన్వయంతో కొనసాగితేనే ఇలాంటి అసాధారణ కార్యక్రమాలు రూపుదాల్చుతాయని, జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్,అటవీ,వ్యవసాయ,ఉద్యానశాఖలకు చెందిన అధికారులందరిలోనూ ఐక్యత ఉండటం ఆహ్వానించదగిన పరిణామమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ, పక్షుల ప్రేమికుల కోసం నూతన ప్రాజెక్టుల ఏర్పాటుతో కరీంనగర్ పోలీసులు జాతీయస్థాయిలో పర్యావరణానికి సంబంధించిన ఎంతటిగొప్ప ఆవార్డులకు సైతం ఎంపికచేయడానికి అర్హులని కితాబునిచ్చారు.

ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ఫోటోఎగ్జిబిషన్‌లోని చిత్రాలను సూచిస్తూ ఎలాంటి మొక్కల పెంపకానికి అనువుగా లేనటువంటి ప్రాంతాన్ని అంచెలవారీగా అభివృద్ధి చేసి మొదటి విడత మియావాకి ప్రాజెక్ట్-1ను పూర్తిచేశామని, వర్షాల ప్రభావంతో నీరునిల్వడం, భూసార పరీక్షలతో వెలుగులోకి వచ్చిన లోపాలను సరిదిద్దుకుంటూ రెండవ ప్రాజెక్ట్ నిర్మాణన్నిపూర్తి చేశామన్నారు. అన్నిస్థాయిలకు చెందన పోలీసులు తమవంతు శ్రమదానంతో ఈ మహాయజ్ఞంలో తమవంతు సహకారం అందించారని తెలిపారు. జిల్లా మంత్రి 06లక్షల నిధులను ఇందుకు మంజూరు చేయగా, కలెక్టర్ సహకారంతో డ్రిప్‌విధానం ద్వారానీరందించడం, మొక్కల ఎదుగుదలకు ఆటకం లేకుండా నిల్వనీటిని బయటకు పంపించేందుకు మున్సిపల్ అధికారులు శాశ్వత చర్యలు తీసుకుని తమవంతు సహాయ,సహకారాలు అందించారని తెలిపారు.

సెల్యూట్ కమలాసన్

చిట్టడవుల నిర్మాణం, హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలతోపాటు పక్షులను ఆకర్షింపజేయడం కోసం వివిధ రకాలుగా కరీంనగర్ పోలీసులు తీసుకుంటున్న చర్యలకు గాను ముఖ్యమంత్రి కార్యాలయం ఓఎస్‌డి ప్రియాంక వర్గీస్ సెల్యూట్ కమలాసన్ అంటూ అభినందించారు. నవగ్రహ,రాశి,నక్షత్ర,రాతివనం ప్రాంతాలను చూసి మంత్రముగ్ధులయ్యారు. దాదాపు అన్నిరకాల మొక్కలు ఈ ప్రాజెక్ట్ ఆవరణలో ఉన్నాయని, అరుదుగా లభించే మరో 15రకాల వరకు మొక్కలను ఉచితంగా అందజేస్తానని తెలిపారు. నవగ్రహ, రాశి,నక్షత్రవనాల నిర్మాణ ప్రాంతాల్లో రక్తప్రసరణ సమతుల్యంగా కొనసాగేందుకు ఉపకరించే (పంచతత్వనడక) ట్రాక్‌నిర్మాణాన్ని పరిశీలించి ఇంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం పోలీసుల అంకితభావానికి నిలువుటద్దంలా నిలుస్తోందని చెప్పారు. ఈ సిటిసి ప్రాంతంలో హెలిప్యాడ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లయితే కరీంనగర్‌లో అందుబాటులో ఉన్న సందర్శకప్రాంతాలన్ని అతిసమీపంలో ఉంటాయని, అతిథులు వచ్చిన సందర్భాలలో పటిష్ట భద్రత కూడా ఉంటుందని చెప్పారు. హెలీప్యాడ్ నిర్మాణం, ఇక్కడి ప్రాజెక్టును తీర్చిదిద్దబడిన తీరును రాష్ట్ర ముఖ్యమంత్రికి వివరిస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె శశాంక, మున్సిపల్ కమిషనర్ వల్లూరి క్రాంతి, అడిషనల్ డిసిపిలు ఎస్ శ్రీనివాస్(ఎల్అండ్ఓ), జి చంద్రమోహన్(పరిపాలన), ట్రైనీ ఐఏఎస్ అధికారి అంకిత్, ఏసిపి శివభాస్కర్, వివిధ ప్రభుత్వశాఖలను చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

విద్యా సంస్కరణలతో మారనున్న ఎపి

-పేదలకు అందుబాటులోకి నాణ్యమైన విద్యకు కృషి

అమరావతి,ఫిబ్రవరి13(ఆర్ఎన్ఎ): ఎపిలో విద్యారంగంలో సంస్కరణలకు సిఎం జగన్ వేగంగా అడుగులు వేస్తున్నారు. సామాన్యులకు విద్యను చేరువచేసే లక్ష్యంతో అనేక విధాలుగా ప్రయత్నాలు మొదలు పెట్టారు.

సర్కార్ అనేకానేక పథకాలతో విద్యార్థులకు అండగా నిలవాలని చూస్తోంది. మూడేళ్లలో 45 వేల పాఠశాలలు, 471 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 3,287 ప్రభుత్వ హాస్టల్స్, 148 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల రూపురేఖలు మార్చబోతున్నట్లు సిఎం వైఎస్ జగన్ ఇప్పటికే ప్రకటించారు. ఈ కార్యక్రమం కోసం దాదాపు రూ.13 వేల కోట్లు ఖర్చవుతుందని అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలన్నీ పూర్తిగా మార్చేందుకు మనబడి నాడు-నేడు కార్యక్రమం అమలు చేస్తున్నారు. మూడేళ్లలో రాష్ట్రంలో అన్ని స్కూళ్ల రూపు రేఖలు మార్చబోయే కార్యక్రమం ఇది. మధ్యాహ్న భోజనం మెనూలో కూడా పూర్తిగా మార్పులు చేస్తూ.. గోరుముద్ద అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.. దీనివల్ల అదనంగా దాదాపు రూ.200 కోట్లు పైచిలుకు ఖర్చవుతుందని అంచనా వేశారు. ప్రతి పిల్లాడిని చదివించడమే కాదు.. వారు భావితరంతో పోటీ పడాలన్న లక్ష్యం మేరకు ముందుకు సాగుతున్నారు. అంతర్జాతీయంగా పోటీపడే పరిస్థితి రావాలని. అది జరగాలంటే ప్రతి స్కూల్ ఇంగ్లిష్ మీడియం వైపు పరుగెత్తాలన్న సంకల్పంతో సిఎం జగన్ ఉన్నారు. అందుకే వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఆరో తరగతి వరకూ పూర్తిగా ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టబోతున్నారు. ఆ తర్వాత ప్రతి ఏడాది ఒక్కో తరగతికి పెంచుకుంటూ మొత్తంగా నాలుగేళ్లలో బోర్డు ఎగ్జామ్‌ను ఇంగ్లిష్ మీడియంలో రాసే పరిస్థితి కల్పిస్తామని ప్రకటించారు. ఇందులో భాగంగా పిల్లలకు బ్రిడ్జి కోర్సులు, టీచర్లకు శిక్షణ ఇస్తున్నట్లు ప్రకటించారు. వీటన్నింటితో పాటు తెలుగును తప్పనిసరి సబ్జెక్టుగా తీసుకొస్తున్నట్లు తెలిపారు. మొత్తంగా ఎపిలో విద్యారంగంలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టారు. దీంతో కార్పొరేట్ స్కూళ్ల ఫీజు దోపిడీకి కళ్లెం పడనుంది. వేలకోట్లు ప్రజల నుంచి పీలుస్తున్న విద్యాసంస్థలకు ముకుతాడు పడనుంది. ప్రభుత్వమే నాణ్యమైన విద్యను, ఇంగ్లీష్ మీడియాన్ని ప్రకటించినందున ఇక ఎపిలో విద్యారంగంలో విప్లవం రాకమానదు. ఇకపోతే ఏపీ ప్రయివేటు యూనివర్సిటీల చట్టం-2006 సవరణకు రూపొందించాల్సిన అంశాలపై అధికారులతో సీఎం చర్చించారు. ఈ సందర్భంగా ప్రయివేటు యూనివర్సిటీల్లోని 35 శాతం సీట్లు ప్రభుత్వ కోటా కింద భర్తీ చేసే ప్రతిపాదనలపై పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో తొలిసారిగా ప్రయివేటు యూనివర్సిటీలు స్థాపించే వారికి అత్యున్నత ప్రమాణాలను నిర్దేశిరచాలని అధికారులకు దిశా నిర్దేశర చేశారు. కోవిడ్?19 తర్వాత కేంద్ర ప్రభుత్వ అన్‌లాక్ ఉత్తర్వుల మేరకు దశల వారీగా కాలేజీల పునః ప్రారంభం, క్లాసుల నిర్వహణపై సమావేశంలో చర్చించారు. ఎయిడెడ్ కాలేజీల నిర్వహణ పూర్తిగా ఇటు ప్రభుత్వ యాజమాన్యంలో, లేక అటు ప్రయివేటు యాజమాన్యాల చేతిలో ఉండాలనే అభిప్రాయం వ్యక్తమైంది. ఎయిడెడ్ కాలేజీలను పూర్తిగా ప్రభుత్వానికి అప్పగిస్తే ప్రభుత్వమే నడుపుతుందని, లేని పక్షంలో ప్రైవేటు యాజమాన్యాలే నడుపుకొనేలా చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు.

70 శాతానికి పైగా భవనాలను పూర్తి

అసంపూర్తిగా వున్న భవనాలకు 2154 కోట్లు అవసరం

అమరావతి భవనాల నిర్మాణాలపై ఏర్పాటైన కమిటీ భేటీ

అమరావతి,ఫిబ్రవరి13(ఆర్ఎన్ఎ): ఏపీ రాజధాని అమరావతిలో భవనాల నిర్మాణంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీఎస్ ఆదిత్యనాథ్ దాస్ నేతత్వంలోని కమిటీ తొలి సమావేశం జరిగింది. శాసన రాజధానికి సంబంధించిన అసంపూర్తి భవనాల నిర్మాణంపై కమిటీ చర్చించింది. రాజధాని పరిధిలోని భవనాలు ఏ మేరకు పూర్త య్యాయి అనే అంశంపై కమిటీకి ఎఎంఆర్‌డీఏ అధికారులు వివరించారు. అసంపూర్తిగా ఉన్న భవనాల నిర్మాణానికి రూ. 2154 కోట్లు నిధుల అవసరమని ఓ అంచనాకు వచ్చినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం కాంట్రాక్టర్ల చెల్లింపుల నిమిత్తం సుమారు రూ. 300 కోట్లు అవసరమని కమిటీ ఓ నిర్ధారణకు వచ్చింది. 288 ఎ÷-లాట్లల్లో 74 శాతం పూర్తయినట్టు ఎఎంఆర్‌డీఏ పేర్కొంది. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవనాల్లో 288 ఎ÷-లాట్లు చేపట్టాల్సింది ఉందని, 144 ఎ÷-లాట్లలో 74 శాతం మేర నిర్మాణాలు పూర్తి చేసినట్టు వెల్లడించింది. అఖిల భారత సర్వీస్ అధికారుల భవనాల్లో 144 ఎ÷-లాట్లు చేపట్టాల్సి ఉందని, ఎన్జీవో హౌసింగ్‌లోని 1,968 ఎ÷-లాట్లలో 62 శాతం పూర్తయినట్టు ఎఎంఆర్‌డీఏ స్పష్టం చేసింది. అసంపూర్తి నిర్మాణాలకు సంబంధించి నిధుల సమీకరణ విషయంలో బ్యాంకర్లు, కాంట్రాక్టర్లతో సమావేశమవ్వాలని ఎమ్మార్డీఏని కమిటీ ఆదేశించింది. ఇక 70 శాతానికి పైగా పూర్తయిన భవనాల నిర్మాణాన్ని ముందుగా పూర్తి చేయాలని కమిటీ సూతప్రాయంగా నిర్ణయానికి వచ్చింది. మార్చి రెరడో వారంలో రెరడోసారి కమిటీ భేటీ కావాలని నిర్ణయిం చింది. సీఎస్ ఆదిత్యనాథ్ దాస్ నేతత్వంలో నిన్ననే తొమ్మిది సభ్యులతో రాష్ట్ర ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసింది. ఇవాళ సమా వేశమైన కమిటీ.. రాజధాని ప్రాంతంలోని అసంపూర్తి భవనాల నిర్మాణానికి అవసర మైన నిధుల అంచనాపై సమీక్ష నిర్వహించింది.

ఏపీ సీఎస్ నేతత్వంలో కీలక భేటీ

ఆంధ్ర ప్రదేశ్ సీఎస్ నేతత్వంలో కీలక భేటీ జరిగింది. శాసన రాజధానికి సంబంధించిన అసంపూర్తి భవనాల నిర్మాణంపై చర్చ జరిగినట్టు చెబుతున్నారు. సీఎస్ నేతత్వంలో నిన్ననే తొమ్మిది మంది సభ్యులతో ప్రభుత్వం కమిటీ వేసింది. రాజధాని ప్రాంతంలోని అసంపూర్తి భవనాల నిర్మాణానికి నిధుల అంచనాపై సమీక్ష అవసరమని పేర్కొన్నారు. ఏయే భవనాలు అవసరం.. ఏయే భవనాలు అనవసరం అనే జాబితాను సీఎస్ నేతత్వంలోని కమిటీ సిద్ధం చేయనుంది. శాసన రాజధానికి అవసరమైన భవనాల నిర్మాణాన్ని మాత్రమే పూర్తి చేయాలని జగన్ సర్కార్ భావిస్తూ, సెక్రటేరీయేట్, హూచ్వోడీ, శాశ్వత హైకోర్టు భవన నిర్మాణాల కొనసాగింపుపై ప్రభుత్వ నిర్ణయాన్ని ఏఎమ్మార్డీఏ కమిషనర్ కోరారు. దీంతో శాసన రాజధానికి అవసరమైన భవనాలు, హౌసింగ్ యూనిట్ల నిర్మాణం.. ఖర్చు తగ్గించుకునేలా సీఎస్ నేతత్వంలోని కమిటీ ప్రణాళికల రూపకల్పనపై అధ్యయనం చేయనుంది. కమిటీలో సభ్యులుగా అసెంబ్లీ కార్యదర్శి, ఎమ్మార్డీఏ కమిషనర్ సహా జీఏడీ, పట్టణాభివద్ధి, న్యాయ,

పరమ పవిత్రం మాంగల్య బంధం

(14 ఫిబ్రవరి 'ప్రపంచ వివాహ దినం' సందర్భంగా)

భారతదేశం సత్సంప్రదాయాలకు, సనాతన సంస్కృతికి చిరునామా. మన వైవాహిక వ్యవస్థకు 4250 సంవత్సరాల చరిత్ర ఉంది. సీతారాములు, శివపార్వతులు, వశిష్ఠ – అరుంధతి ఉత్తమ దంపతులకు ప్రతీకలు. జీవితంలో స్త్రీ పురుషుల మధ్య శాశ్వతంగా జీవన మైత్రిని ఏర్పరుస్తూ, శారీరకంగా మానసికంగా ఏకం చేసే మరుపురాని మధుర ఘట్టమే పరిణయం వేడుక. మానవ సమాజంలో వివాహం ఒక పరమ పవిత్ర విశ్వజనీన, సాంస్కృతిక, చట్టబద్ధమైన ఒప్పంద శుభకార్యం. వివాహానికి పర్యాయ పదాలుగా పెళ్ళి, పరిణయం, సప్తపది, కళ్యాణం, పాణిగ్రహణం, కన్యాదానం లాంటివి నిలుస్తాయి. ఒక పురుషుడిని మరియు మహిళను ఏకం చేసే చట్టబద్ధమైన, సామాజిక అంగీకారంతో కూడిన విడదీయరాని అనుసంధాన బంధమే వివాహ వేడుక. పెళ్ళి అనబడే సంప్రదాయ పవిత్ర వేడుక ప్రకారం ఏకమైన స్త్రీ పురుషులు కుటుంబంగా రూపాంతరం చెంది కొన్ని ప్రత్యేక దాంపత్య ధర్మాలు, లైంగిక సంబంధాలు, హక్కులు మరియు భాధ్యతలు నిర్వహించే అర్హత కలుగుతుంది. వివాహంతో ఒకటైన జంట మధ్య పరస్పర ప్రేమ జనించి విడదీయరాని అనురాగప్రదమైన బంధంగా నిలబడుతుంది. ప్రపంచవ్యాప్తంగా వివాహ వ్యవస్థ ప్రాధాన్యతను వివరించడానికి ప్రతియేటా ఫిబ్రవరి రెండవ ఆదివారం, అనగా 14 ఫిబ్రవరి 2021న 'ప్రపంచ వివాహ దినం' పాటించుట జరుగుతోంది.

కళ్యాణంతో కలిసి పోయిన దంపతుల మధ్య స్వల్ప విభేదాలు పొడచూపినా ధర్మం అనే శక్తి వారిని అవిచ్ఛిన్నంగా ఒకటిగా ఏకం చేస్తూ ఉంటుంది. వివాహ శుభకార్యాలు కుల, మత, తెగలను బట్టి మారుతూ ఉంటాయి. కొన్ని సంస్కృతుల్లో ఇద్దరు భాగస్వామ్యుల మధ్య లైంగిక సంబంధ అర్హత కోసం చేసుకోబడే ఒప్పందంగా అర్థం చేసుకోవాలి. వివాహాలలో ఏకవివాహాలు (ఒక పురుషుడికి ఒక స్త్రీకి మధ్య పెళ్ళి), బహుభార్యత్వం (ఒక పురుషుడికి ఒకటి కన్న ఎక్కువ భార్యలు), బహుభర్తృత్వం (ఒక స్త్రీకి ఒకరి కన్న ఎక్కువ భర్తలు), స్వలింగ వివాహాలు లాంటి రకాలు ఉన్నాయి. దంపతుల మధ్య తీవ్ర విభేధాల కారణంగా కొన్ని వివాహబంధాలు విడాకుల వరకు పోవడం జరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా వివాహబంధం బలహీనమైన దేశాల్లో విడాకులు అత్యధికంగా రికార్డు అవుతున్నాయి. విడాకులు అధికంగా జరుగుతున్న దేశాలలో లాక్సెన్‌బర్గ్ (87 శాతం), స్పేయిన్(65 శాతం), ఫ్రాన్స్ (55 శాతం), రష్యా (51 శాతం), యూయస్(46 శాతం), జర్మనీ (44 శాతం), యూకె(42 శాతం), న్యూజిలాండ్ (42 శాతం), ఆస్ట్రేలియా(38 శాతం) మరియు కెనడా (38 శాతం) ఉన్నాయి. వివాహ వ్యవస్థకు అత్యధిక పవిత్ర ప్రాధాన్యత కలిగిన ఇండియాలో అతి తక్కువ విడాకులు నమోదు చేసే దేశంగా భారత్ ప్రథమ స్థానంలో ఉండడం సంతోషదాయకం. అత్యల్ప విడాకులు కలిగిన దేశాల్లో ఇండియా (1 శాతం), చిలీ (3 శాతం), కొలంబియా (9 శాతం), మెక్సికో (15 శాతం), కెన్యా(15 శాతం), దక్షిణ ఆఫ్రికా (17 శాతం), ఈజిప్ట్ (17 శాతం), బ్రెజిల్ (21 శాతం), టర్కీ (22 శాతం) మరియు ఇరాన్ (22 శాతం)లలో తక్కువ నమోదు అవుతున్నాయి.

హిందూ సంప్రదాయంలో పెళ్ళికి ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. వివాహితులు మాత్రమే కొన్ని హిందూ సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించే అర్హతను కలిగి ఉంటారు. హిందూ సంప్రదాయ కళ్యాణాల్లో ముఖ్యమైన ఘట్టాలుగా పెళ్ళిచూపులు, నిశ్చితార్థం, వరపూజ, ఎదురుకోలు, గౌరీపూజ, మంగళస్నానాలు, కాళ్లుకడగడం, కన్యాదానం, సుముహూర్తం, మంగళసూత్రధారణ, తలంబ్రాలు, సప్తపది, నాగవల్లి, అరుంధతీ నక్షత్రదర్శనం, అప్పగింతలు లాంటి పలు ముఖ్య ఘట్టాలు ఉంటాయి. హిందూవివాహ చట్టం ప్రకారం 21 ఏండ్లు దాటిన పురుషుడు మరియు 18 ఏండ్లు దాటిన మహిళ మధ్య వివాహం చట్టబద్ధంగా చేయవచ్చు. ఈ నిర్ధేశిత వయస్సుకు లోబడిన వారు వివాహానికి చట్టరీత్యా అనర్హులుగా పేర్కొనబడింది. పెళ్ళితో ఒకటైన జంటకు సంబంధించిన రెండు కుటుంబాలను ఏకం చేసే శాశ్వత బంధంగా వివాహం గుర్తించబడింది. ఆచార క్రతువులతో జరిగిన హిందూ వివాహం చట్టబద్ధమైంది. పెళ్ళి జరిగిన తరువాత ప్రభుత్వ సబ్‌రిజిస్టర్ కార్యాలయంలో అధికారికంగా నమోదు చేసుకోవచ్చు. పెద్దలు కుదిర్చే పెళ్ళిళ్ళను నిశ్చయ లేదా సంప్రదాయ వివాహాలుగా(అరేంజ్డ్ మ్యారేజ్) మరియు యువతీయువకులు ప్రేమించుకొని చేసుకునే వివాహాలను ప్రేమ పెళ్ళిళ్ళు (లవ్ మ్యారేజ్)గా పిలుస్తారు. హిందూ వివాహంలో ఏకమైన భార్యాభర్తలు రెండు శరీరాలుగా ఉన్నప్పటికీ ఒకే ప్రాణంగా మనుగడ సాగించడం జరుగుతుంది. హిందూ వివాహాల్లో బ్రహ్మ, గాంధర్వ, క్షాత్ర మరియు రాక్షస వివాహ పద్ధతులు ఉన్నాయి. పెళ్ళిలో వధూవరులు వేసే ఏడు అడుగుల్లో (సప్తపది) 1వ అడుగు ఇద్దరినీ ఒక్కటి చేయడానికి, 2వ అడుగు శక్తికి, 3వ అడుగు వ్రత సిద్ధికి, 4వ అడుగు ఆనంద సిద్ధికి, 5వ అడుగు పశుసంపదకు, 6వ అడుగు సుఖజీవనానికి మరియు 7వ అడుగు గృహస్థాశ్రమ నిర్వహణకు విష్ణువు అనుగ్రహించారని కోరుకోవడం జరుగుతుంది.

ముస్లిమ్ మతాచార వివాహాన్ని నిఖా ద్వారా స్త్రీ పురుషుల మధ్య మత సమ్మతి పొందే న్యాయమైన వైవాహిక ఒప్పందం మాత్రమే. ఈ పెళ్ళిలో ఎలాంటి పవిత్ర క్రతువులు లేదా కార్యాలు ఉండవు. ఈ ఒప్పంద సమయంలో వరుడు వధువుకు మెహర్ చెల్లింపుకు అంగీకరించాలి. ముస్లిమ్ మతంలో ఒక పురుషుడు నలుగురు స్త్రీల వరకు పెళ్ళి (బహుభార్యాత్వం) చేసుకోవచ్చు, కాని స్త్రీ మాత్రం ఒకే పురుషుడిని వివాహం చేసుకోవాలి. 2019లో ట్రిపుల్ తలాక్ (విడాకుల పద్ధతి) రాజ్యాంగ విరుద్ధమని సుప్రీమ్‌కోర్టు నిషేధించిన విషయం మనకు తెలుసు. బైబిల్ ప్రకారం క్రైస్తవ వివాహం అన్నింటి కన్న ఘనమైనదని చెప్పబడింది. క్రైస్తవ వివాహాలను చర్చిలో ఫాదర్ మతగురువుగా సాక్షుల సమక్షంలో జరిగే పౌర ఒప్పందంగా గుర్తించాలి. క్రైస్తవ మతంలో ఏక వివాహ నియమం మాత్రమే ఉంది.

మారుతున్న జీవనశైలి, ఆధునిక పోకడలు, ప్రపంచీకరణ, అంతర్జాల ప్రభావం, పాశ్చాత్య పోకడల కారణంగా వివాహ వ్యవస్థకు నెమ్మదిగా బీటలు పడుతూ, నూరేళ్ళ పంట నూరు రోజులకే బలహీనపడుతోంది. పసుపు పారాణి ఆరక ముందే తాళి బరువు అవుతుంది. ఏడు అడుగులు ఏడు రోజుల్లోనే మరిచి పోతున్నారు. వేసిన మూడు ముళ్ళు భార్యాభర్తల మధ్య ముళ్లలా గుచ్చుకుంటున్నాయి. నేడు దేశంలో 14 లక్షల మంది స్త్రీ పురుషులు విడాకులు తీసుకోవడం విచారకరం. దేశంలో అత్యధిక విడాకులు గుజరాత్, అస్సాం, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో నమోదు అవుతున్నాయి. సాఫ్ట్‌వేర్ రంగంలో అత్యధికంగా 56 శాతం విడాకులు నమోదు అయ్యాయి. విడాకులు పెరగడానికి కారణాలుగా ఆర్థిక స్వేచ్ఛ, అపరిమిత స్వతంత్రం, ఫామిలి కోర్టులు పెరగడం, రెచ్చగొట్టే లాయర్లు, సహనశీలత తగ్గడం, ఆర్థిక వ్యవహారాలు, సామాజిక మాధ్యమాలు, విచ్ఛిన్నమైన ఉమ్మడి కుటుంబాలు, పురుషాధిక్యం, అక్రమ లైంగిక సంబంధాలు, తాత్కాలిక విభేదాలు, చిన్న కుటుంబాల్లో చిచ్చులు పెరగడం లాంటివి ముఖ్యకారణాలుగా గుర్తించబడినవి. పురుషాధిక్యంతో 42 శాతం, సహనం కోల్పోవడంతో 21 శాతం విడాకులు జరుగుతున్నాయి.

వివాహం రాజీపడడం నేర్పేద కాదు, సర్దుకు పోవడం మాత్రమే నేర్పుతుంది. ఆధునిక కాలంలో కులాంతర, మతాంతర వివాహాలు కూడా పెరగడం చూస్తున్నాం. సింగిల్ పేరెంట్ కల్చర్ నేటి నవ్యత అయ్యింది. సహజీవన సంస్కృతే ఆధునికత అవుతోంది. ఒకప్పటి వివాహ ఒప్పందాలు నేడు కులం, మతం, ప్రేమ, కుటుంబ నేపథ్యం, ఆస్తిపాస్తులు, ఆచారాలు, సంప్రదాయాలు, జాతకాలు, వరకట్నాలు, కీర్తి ప్రతిష్టలు లాంటి ప్రామాణికాల నడుమ నలిగిపోతున్నాయి. గతంలోని 16 రోజుల పెళ్ళి పండుగ నేడు 2 గంటలకు కుదించుకు పోయింది. హిందూ వివాహ వ్యవస్థలో మార్పులుగా సతీసహగమన నిషేధ, హిందూ విధవ పునర్‌వివాహ, ప్రత్యేక వివాహ, బాల్యవివాహ నిషేధ, హిందూ వివాహ, వరకట్న నిషేధ చట్టాలు వచ్చాయి. వివాహబంధాలను చట్టం కట్టి పడేయదు. భార్యాభర్తల మధ్య ప్రేమానురాగాలు అల్లుకుపోవాలి. ఇంటికి ఇల్లాలే దీపం కావాలి. భర్త కుటుంబ నావకు చుక్కాని కావాలి. సర్దుకుపోయే గుణం సంసార బంధాన్ని సుదృఢ పరుచుతుంది. ఆదర్శ కుటుంబ బండికి జత ఎడ్లుగా దంపతులు నిలుపుస్తారు. తాత్కాలిక సమస్యలు కాలంతో పాటు పలుచబడతాయి. విడాకులు తీసుకున్న వారిని సమాజం చులకనగా చూస్తుంది. వివాహం తరువాత ప్రేమించినా, ప్రేమించిన తరువాత వివాహమాడినా అనురాగబంధాలే ఇంటిని పుణ్య గృహంగా మార్చుతాయి.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

పులిజాడలతో గ్రామాల్లో తొలగని అలజడి

ఎక్కడ దాడి చేస్తుందో అన్న భయాందోళన

మారుమూల గ్రామాల ప్రజల్లో అడవి భయం

ఆదిలాబాద్,ఫిబ్రవరి13(ఆర్ఎన్ఎ): ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో ఇటీవల పులల జాడ కలవరసపరుస్తోంది. శివారు మండలాల్లో గత కొద్ది రోజులుగా పులుల సంచారంపై అలజడి నెలకొంది. తాజాగా దాని సంచారం కనిపించడంతో పాటు పలుచోట్ల దాడిచేసిన ఘటనలు ఇప్పుడు సమీప ప్రాంతాల ప్రజలకు కునుకు లేకుండా చేస్తోంది. పులుల సంచారంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. జిల్లాలో పులులు సంచరిస్తున్న నేపథ్యంలో పక్కా ఆధారాలు లభించడంతో ఇప్పుడు ఆందోళన కలుగుతోంది. పులులు మధ్యలో ఆదిలాబాద్ శివారు మండలాల్లోని జనవాసాల్లోంచి వెళ్తున్నాయి. మహారాష్ట్ర లోని తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి బయటకు వస్తున్న పులులు పెన్‌గంగ నది దాటి వచ్చి ఆవాసం ఏర్పర్చుకునేందుకు అడుగులు వేస్తూ చుట్టుపక్కల మండ లాల్లోని గ్రామాలు, పంట పొలాలు, రోడ్లు దాటుతూ వెళ్తున్నాయి. తాంసి, భీంపూర్ మండలాల్లో ఆవులు, ఎద్దులపై దాడి జరిగిన సంఘటనలను బట్టి రెండు పులులు సంచరిస్తున్నాయనే వదంతులు వినిపించాయి. పలుచోట్ల ఎద్దులపై పులి పంజా విసిరింది. అక్కడ దాని అడుగులు కనిపించాయి. పులులు రాత్రి వేళల్లోనే సంచరిస్తాయని అటవీ శాఖాధికారులు చెబుతున్నారు. ప్రతీరోజు సుమారు 20 కిలోమీటర్ల వరకు కదులుతాయని పేర్కొంటున్నారు. పగటి వేళా విశ్రమి స్తుంది. ఒక ప్రత్యేక ప్రాంతంలో కొద్ది రోజులు మాత్రమే ఉంటుంది. ఈ నేపథ్యంలో ఒక ప్రాంతంలో కనిపించిన పులి కొద్ది రోజులు ఆ సమీపంలో ఉండి వెళ్లిపోతుంది. ఇదిలా ఉంటే అటవీ శాఖాధికారులు పులుల విషయంలో గోప్యత పాటిస్తున్నారు. అదే సమయంలో వాటికి జనావాసాల సమూహాల్లో ప్రశాంతత వాతావరణం కల్పించడం ద్వారా అభయారణ్యానికి తరలిపోతాయని చెబుతున్నారు. పంట పొలాల చుట్టూ విద్యుత్ వైర్లు అమర్చకుండా చూస్తున్నారు. ప్రధానంగా గ్రామస్తులు భయంతో వాటిని హతమర్చేందుకు ఇలాంటి చర్యలకు దిగే ఆస్కారం ఉందని, ముందు జాగ్రత్తగా అటవీ శాఖాధికారులు ఈ చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం బేస్ క్యాంప్‌ను కొనసాగిస్తున్నారు. పెన్‌గంగకు అవతలి వైపు మహారాష్ట్ర భాగంలోని తిప్పేశ్వర్ పులుల అభయారణ్యంలో పులుల పునరుత్పత్తి పెరిగింది. ప్రధానంగా అక్కడ టైగర్ రిజర్వు ప్రాంతంలో 3 గ్రామాలు ఉండగా, ఆ ప్రజలను అక్కడి నుంచి తొలగించి పునరావాసం కల్పించినట్లు ఇక్కడి అటవీ శాఖాధికారులు చెబుతున్నారు. పులులకు నీళ్లు, వేట కోసం వన్యప్రాణుల లభ్యత ఉండటం, ప్రశాంత వాతావరణం నేపథ్యంలో ఆడ, మగ పులుల కలయికతో పునరుత్పత్తి పెరిగినట్లు చెబుతున్నారు. అలాగే శాఖాహారులైన వన్యప్రాణుల కోసం గడ్డి విత్తనాలు పెంచడం, తద్వారా ఆ వన్యప్రాణులు గడ్డిని ఆహారంగా తీసు కుంటాయి. ఈ వన్యప్రాణులు పులులకు ఆహారంగా మారుతాయి. ఇటువంటి అనువైన పరిస్థితుల్లోనే అక్కడ పులుల సంఖ్య పెరగడానికి దోహదపడినట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే తిప్పేశ్వర్ అభయారణ్యం విస్తీర్ణంలో చిన్నది కావడం, ఇటు పులుల సంఖ్య పెరిగిన దృష్ట్యా నిర్దిష్ట ఆవాసం కోసం పులులు తిప్పేశ్వర్‌ను వీడి మరోప్రాంతం కోసం కదులుతున్నాయి. అవి విస్తీర్ణంలో చాలా పెద్దదైన కవ్వాల్ చేరితే ఈ ప్రాంతంలో వాతావరణ సమతుల్యత ఏర్పడేందుకు దోహద పడతాయని అటవీశాఖ అధికారులు అభిప్రాయపడు తున్నారు. ఇప్పటివరకు కవ్వాల్‌లో పులుల సంచారం ఉన్నా స్థిర నివాసం ఏర్పర్చు కోలేదని, ఈ నేపథ్యంలో ఈ పులులు కవ్వాల్ వైపు వెళ్తే మాత్రం వాటికి నిర్దిష్ట ఆవాసానికి సరిపడ వాతావరణం ఉండంటున్నారు.

ప్రేమికుల దినోత్సవం కాదు...

పుల్వామా అమరులను స్మరిద్దాం: భజరంగ్‌దళ్

హైదరాబాద్,ఫిబ్రవరి13(ఆర్ఎన్ఎ): వాలంటైన్స్ డేను బహిష్కరించి పుల్వామా అమర వీరులను స్మరించుకుందామని భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు పిలుపునిచ్చారు. ఎక్కడో విదేశాల్లో జరిగిన ఓ ఘటనను మనం ఆచరించడం తగదన్నారు. పలు ప్రాంతాల్లో వాలంటైన్స్‌డే బహిష్కరణపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. మన సంస్కృతి కాని ఓ విపరీత ధోరణికి సంబంధించిన కార్యక్రమాన్ని ఎందుకు ఆచరించాలో యువత ఆలోచన చేయాలన్నారు. రోమ్ దేశానికి చెందిన వాలంటైన్ అనే వ్యక్తి తమ దేశానికే ద్రోహం చేసిన వ్యక్తి అని ఆరోపించారు. తన దేశంపై శత్రువులు దాడి చేయడానికి వస్తే దేశ రక్షణ కోసం పోరాడకుండా దేశ యువతకు ప్రేమ వివాహాలు చేశాడన్నారు. దీన్ని సహించని ఆ దేశ రాజు క్లాడియస్ ఫిబ్రవరి 14న అతడిని ఉరి తీశాడని తెలిపారు. మల్టీనేషనల్ కంపెనీలు, ఉగ్రవాదసంస్థలు హోటల్స్, మాల్స్, పబ్స్ భారత ఆర్థికవ్యవస్థ దెబ్బతీసేవిధంగా యువతను ఆకర్షించే రీతిలో కార్యక్రమాలు నిర్వహిస్తూ వారిని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. 2019 ఫిబ్రవరి 14న పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ జరిపిన దాడిలో 40 మంది జవాన్లు ప్రాణత్యాగం చేశారని తెలిపారు. వారి త్యాగాలను స్మరిస్తూ దేశంలోని యువత ఫిబ్రవరి 14ను వీరజవాన్ల దినోత్సవంగా జరుపు కోవాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 14న యువత వికృత చేష్టలకు పాల్పడితే భజరంగ్‌దళ్ అడ్డుకుంటుందన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన ఏనుగు మనోహర్ రెడ్డి

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 13 : (నేటినిజం ప్రతినిధి):వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పామ్ముల తిరుపతి కుటుంబాన్నిటీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి శనివారంపరామర్శించి తిరుపతి చిత్రపటానికి నివాళులు అర్పించారు అనంతరం అదే గ్రామానికి చెందిన గుండె పోటుతో మరణించిన గాలిపెల్లి రంగయ్య కుటుంబ సభ్యులను కూడాపరామర్శించారు. ఆయనతో పాటు సర్పంచ్ ఊరడి రాంరెడ్డి,మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ ఊరడి ప్రవీణ్, టీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు ఊరడి రాజిరెడ్డి ,వంకల రాజశేఖర్, బెజుగమ్ మహేష్, గుండెల్లి శ్రీనివాస్, రాజు ,కట్ట ప్రవీణ్, యెరుగొక్కుల దేవయ్య తదితరులు ఉన్నారు.

టీఆర్ఎస్ వ్యూహాత్మక అడుగులు

భారీగా సభ్యత్వ నమోదుపై దృష్టి

కాంగ్రెస్,బిజెపిల్లోకి వెళ్లకుండా నేతలకు బుజ్జగింపులు

ఆయా పార్టీల్లోకి వెళ్లాలనుకున్న వారే టార్గెట్‌గా కార్యక్రమాలు

హైదరాబాద్,ఫిబ్రవరి13(ఆర్ఎన్ఎ): తాజగా టిఆర్ఎస్ చేపట్టిన సభ్యత్వ నమోదులో బీజేపీ వైపు మొగ్గే అవకాశం ఉన్న వారినే లక్ష్యంగా చేసుకుని టీఆర్ఎస్ వైపు ఆకర్షించేందుకు గులాబీ నేతలు ప్రయత్నిస్తు న్నట్లు చెబుతున్నారు. ఇందుకు బూత్, గ్రామ స్థాయి పార్టీ కార్యకర్తల ద్వారా పంచాయతీల వారీగా అలాంటి వారి జాబితాలను తయారు చేస్తున్నట్లు సమాచారం. అలాగే కాంగ్రెస్‌కు చెందిన అసంతృప్త వర్గాలను టీఆర్ఎస్ వైపు ఆకర్షించేందుకు ప్రయత్నించే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అసంతృప్తవాదులను బీజేపీ వైపునకు వెళ్లకుండా టీఆర్ఎస్‌లోకి చేరేలా ఒప్పించేందుకు ప్రయత్నించే అవకాశం ఉందని పలువురు విశ్లేషిస్తున్నారు. గత కొద్దిరోజుల నుంచి బీజేపీ, కాంగ్రెస్‌లు తమ రాజకీయ కార్యకలాపాలను ముమ్మరం చేస్తూ అధికార టీఆర్ఎస్‌పార్టీని లక్ష్యంగా చేసుకుని ఎదురుదాడి కొనసాగిస్తున్న క్రమంలో ఆ రెండు పార్టీలకు దీటైన సమాధానం చెప్పేందుకోసం టీఆర్ఎస్, పకడ్బందీ కార్యాచరణకు రూపకల్పన చేసింది. ఇందులో భాగంగానే వ్యూహాత్మకంగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని చూస్తోంది. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 50 వేల నుంచి లక్ష వరకు పార్టీ సభ్యత్వాన్ని చేపట్టాలని నిర్ణయించారు. దీని కోసం జిల్లాలపై పార్టీ పరంగానే కాకుండా, కేడర్‌తో నాయకులతో నన్నిహిత సంబంధాలు, చనువు ఉన్న నాయకులను సభ్యత్వ ఇన్‌చార్జీలుగా టీఆర్ఎస్ అధిష్టానం నియమించింది. ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీ సభ్యత్వ కార్యక్రమానికి ఇన్‌చార్జీలకే పూర్తి బాధ్యతలు అప్పజెప్పారు. ఈ ఇన్‌చార్జీల దిశానిర్దేశరతోనే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గ్రామస్థాయి నుంచి చేపట్టబోతున్నారు. ప్రస్తుత క్లిష్టతరమైన రాజకీయ పరిస్థితుల్లో జిల్లా సభ్యత్వ నమోదు బాధ్యతలను స్థానికంగా పార్టీలో ఉన్న బలమైన నేతలకు అప్పజెప్పడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ఇదిలా ఉండగా గ్రామస్థాయి నుంచి సభ్యత్వలక్ష్యాన్ని సాధించేందుకు మండల, గ్రామ ఇన్‌చార్జీలను కూడా నియమించబోతున్నారు. గత కొద్ది రోజుల నుంచి పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటూ అసంతృప్తితో ఉన్న నాయకులను, కార్యకర్తలందరినీ లక్ష్యంగా చేసుకొని ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టబోతున్నారు. దీని కోసం గాను గ్రామస్థాయి నుంచి అసంతృప్తితో ఉన్న నాయకులు, కార్యకర్తల జాబితాను సిద్ధం చేస్తున్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం కాగానే ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల చేత ఈ అసంతృప్తి వాదులందరికీ సభ్యత్వంను కట్టబెట్టాలని లక్ష్యంగా పెట్టుకుంటున్నారు. ఇప్పటికే అసం తృప్తి వాదులపై బీజేపీ నీరియస్‌గా దృష్టి కేంద్రీకరిస్తున్న నేపథ్యంలో వారిని చేజారకుండా చూసుకోవాలని టీఆర్ఎస్ నేతలు యోచిస్తున్నారంటున్నారు. ఇందులో భాగంగానే సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైన రెండు, మూడు రోజుల నుండే ఈ అసంతృప్తి వాదులందరికీ సభ్యత్వాన్ని పూర్తి చేయబోనున్నారంటున్నారు. గణనీయంగా సభ్యత్వాన్ని నమోదు చేసి బీజేపీ, కాంగ్రెస్‌లకు గట్టి షాక్‌నివ్వాలని టిఆర్ఎస్ నేతలు యోచిస్తున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికే పలువురు టీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరడమే కాకుండా మరికొంతమంది సీనియర్ నేతలు, కార్యకర్తలు ఆ పార్టీవైపు చూస్తున్న నేపథ్యంలో టీఆర్ఎస్ అప్రమత్తమవుతోంది. తమ నేతలు, కేడర్‌ను బీజేపీ వైపు ఆకర్షితులు కాకుండా అడ్డుకునేందుకు సభ్యత్వ నమోదును అస్త్రంగా వాడుకోవాలని టీఆర్ఎస్ భావిస్తోందంటున్నారు. వ్యూహాత్మకంగా బీజేపీ వైపు చూస్తున్న నేతలు, కార్యకర్తలకు సభ్యత్వాన్ని కట్టబెట్టి మిగతా వారందరిలో మనోధైర్యం నింపాలని టీఆర్ఎస్ నేతలు నిర్ణయించుకున్నారని చెబుతున్నారు. భారీ సంఖ్యలో సభ్యత్వాన్ని చేపట్టి ఇటు బీజేపీ అటు కాంగ్రెస్‌లకు షాక్‌నివ్వాలన్న యోచనలో టీఆర్ఎస్ పార్టీ ఉందంటున్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీకి చెందిన చాలా మందిని తమ వైపుకు తిప్పుకునేందుకు టీఆర్ఎస్ ఇప్పటికే సన్నాహాలు చేస్తుందంటున్నారు. వీరందరికి మంత్రి, ఎమ్మెల్యేల సమక్షంలో సభ్యత్వ నమోదును చేసి వారిని కట్టడి చేయాలని టీఆర్ఎన్ యోచిస్తోందంటున్నారు. దుబ్బాక ఉప ఎన్నిక, జీహెచ్‌యంసీ ఎన్నికల తరువాత దూకుడు మీదున్న బీజేపీని ఎలాగైనా కట్టడి చేయాలని టీఆర్ఎస్ సీనియర్ నేతలు సీరియస్‌గా యోచిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టబోతున్నందున దీనిని అస్త్రంగా మలుచుకునే ప్రయత్నాలను టీఆర్ఎస్ మొదలుపెట్టిందంటున్నారు.

నిర్మల్ జిల్లా సభ్యత్వ బాధ్యతలు లోక భూమాకు అప్పగింత

మంత్రి ఇంద్రకరణ్‌తో కలసి 14న ప్రారంభించే అవకాశం

నిర్మల్,ఫిబ్రవరి13(ఆర్ఎన్ఎ): జిల్లాతో ఎక్కువ అనుబంధం ఉన్న రాష్ట్ర పాడిపరిశ్రామిభివృద్ధి సంస్థ చైర్మన్ లోకా భూమారెడ్డికి జిల్లా సభ్యత్వ ఇన్‌చార్జీ భాధ్యతలను టిఆర్ఎస్ అధిష్టానం అప్పగించింది. లోక భూమారెడ్డి పార్టీ ఆవిర్భావం నుంచి టీఆర్ఎస్‌లో కొనసాగుతుండడమే కాకుండా జిల్లా అధ్యక్షులుగా కూడా ఆయన బాధ్యతలు నిర్వర్తించారు. అధ్యక్షహోదాలో ఆయన చాలాసార్లు జిల్లాలో పర్యటించడమే కాకుండా అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సీఎం కేసీఆర్‌కు సన్నిహితునిగా గుర్తింపు పొందిన లోక భూమారెడ్డి జిల్లాలోని అందరికన్నా సీనియర్ నేతగా టీఆర్ఎస్ అధిష్టానం గుర్తింపునిచ్చింది. అలాగే లోక భూమా రెడ్డికి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితోనూ, ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్‌లతో, మిగతా సీనియర్ నేతలందరితో కూడా సన్నిహిత సంబంధాలున్నాయి. పార్టీ ఆవిర్భావం నుంచి కొనసాగుతున్న నేతలు, కేడర్‌తో కూడా ఆయన ఇప్పటికీ సత్సంబంధాలు కొనసాగిస్తున్నారు. ఇలాంటి అర్హతల కారణంగా ఈ నెల 14న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి భూమారెడ్డి సభ్యత్వనమోదు కార్యక్రమాన్ని ప్రారంభించ బోతున్నారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల పరిధిలో కూడా పెద్ద ఎత్తున పార్టీ సభ్యత్వాన్ని చేపట్టాలని టీ ఆర్ఎస్ నేత లు భావిస్తున్నారు. కాగా మంత్రి, ఎమ్మెల్యేలు కూడా సభ్యత్వ నమోదు టా÷-గ్గ÷టను చేధించేందుకు పోటాపోటీగా కార్యాచరణను అమలు చేయబోతున్నారు. సభ్యత్వనమోదులో లక్ష్యాన్ని రెండింతలు దాటిన నేతలకు అధిష్టానం ప్రత్యేక గుర్తింపునివ్వబోతుందన్న ప్రకటన నేపథ్యంలో సీనియర్ నేతలంతా ఈ టార్గెట్ పూర్తి చేసేందుకు పోటీపడే అవకాశాలున్నాయంటున్నారు. అయితే సభ్యత్వ లక్ష్యాలను సాధించేందు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు. గత కొద్ది రోజుల నుంచి టీఆర్ఎస్ పార్టీలో ఆవిర్భావం నుంచి పని చేస్తున్న వారు, కొత్తగా పార్టీలో చేరిన వారి మధ్య సమన్వయం ఉండడం లేదన్నది బహిరంగ రహస్యమే. చాలా సందర్భాల్లో ఈ సమన్వయ లోపం బయటపడిన సంఘటనలున్నాయి.

అనేక పార్టీ కార్యక్రమాలకు సీనియర్ నేతలు, కార్యకర్తలు హాజరు కావడం లేదన్న విమర్శలు సైతం లేకపోలేదు. ఇలాంటి క్రమంలో పార్టీ ఆవిర్భావం నుంచి బాధ్యతలను కొనసాగిస్తుండడమే కాకుండా జిల్లా అధ్యక్షునిగా వ్యవహరిస్తున్న రాష్ట్ర పాడిపరిశ్రామాభివృద్ధి సంస్థ చైర్మన్ లోకా భూమారెడ్డికి సీఎం కేసీఆర్ నిర్మల్ జిల్లా బాధ్యతలను అప్పజెప్పడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది.

36వ డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు వసీం అక్రమ్ గుండెపోటుతో హఠాన్మరణం

దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి గంగుల, ఎంఐఎం జిల్లా ఇంచార్జి గులాం అహ్మద్ హుస్సేన్.. ఎంఐఎం..కార్పొరేటర్లు

–చురుకైన కార్యకర్తను కోల్పోయాం,

వసీం తండ్రిని ఓదార్చిన ఎంఐఎం జిల్లా ఇంచార్జి గులాం అహ్మద్ హుస్సేన్

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 13 : (నేటినిజం ప్రతినిధి):మంకమ్మతోట 36వ డివిజన్ ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు, సామాజిక కార్యకర్త మహమ్మద్ వసీమ్ అక్రమ్ (32) శనివారం గుండెపోటుతో మంకమ్మతోట లోని ఆయన నివాస